

# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

బుధవారం 02-09-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 142 రూ॥ 6.00





# అప్పుడు ప్రాజెక్టులు కట్టక ఇవ్వలేదు

# ఇప్పుడు ప్రాజెక్టులున్నా నీళ్ల ఇవ్వడం లేదు!

- ఆంధ్రకు నీళ్లు తరలిపోతుంటే గుడ్లప్పగించి చూశారు.
- పదవులు వస్తే చాలనుకున్నారు.
- రైతులు ఏమైపోతే మాకేమిటి అనుకున్నారు.
- అప్పుడు నీళ్ళున్నా ప్రాజెక్టులు కట్టలేదు.
- రైతులకు నీళ్ళివ్వాలనే సోయి రాలేదు.
- తెలంగాణ కు నీళ్ళివ్వడం సాధ్యమాయ్యేది కాదంటే అదే నిజమ కున్నారు
- ఆంధ్రా నాయకులు చెప్పిన లెక్కలే నమ్ముతూ వచ్చారు.
- తెలంగాణ మేధావులు చెప్పిన వాటిని పెడ చెవిన పెట్టారు.
- తెలంగాణ మేధావులకు పనిపాట లేదన్నారు.
- తెలంగాణ మేధావులను తిరుగుబాటు దారులని కేసులు పెడితే చూస్తూ ఊరుకున్నారు.
- కనీసం అన్యాయం అని కూడా చెప్పిన కాంగ్రెస్ నాయకుడు లేడు.
- ఇప్పుడు ప్రాజెక్టులు ఉన్నా నీళ్లున్నా ఇవ్వడం లేదు.
- ఇప్పుడూ అడిగే దైర్యం ఏ కాంగ్రెస్ నాయకుడికి లేదు.
- రాజకీయం కోసం రైతులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదనలేరు.
- ఎల్లం పల్లి కట్టింది మేమే అంటారు.. అక్కడినుండి నీళ్లిచ్చేందుకు వెనుకడుతున్నారు.
- కరంట్ బిల్లు తడిసి మోపెడు అవుతుందని తప్పించుకుంటున్నారు.
- ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసా ప్రజలదే కదా!
- ప్రజల సొమ్ము ప్రజలకు ఖర్చు చేసేందుకు మీన మేషాలెందుకు?

హైదరాబాద్, నేటిధాత్రి:


నీళ్ల కోసం రైతు తండ్లాడుతున్నాడు. వాన రాకపోతుందా? నీళ్లు అందకపోతాయా? నీళ్లు ప్రభుత్వం విడువలేకపోతోందా? అన్న ఆశతో రైతు సాగు చేస్తున్నారు. సరే ప్రభుత్వం వరి వద్దని చెప్పింది. సూచించింది. హెచ్చరించింది. అయినంత మాత్రాన సాగు వద్దనుకుంటే రైతు ఎలా బతుకుతాడు. ప్రత్నామ్నాయ పంటలు పండించేందుకు అప్పటికప్పుడు ఎలా ముందుకొస్తాడు. ప్రత్యామ్నాయ పంటలు అంటే ఏమిటి? తెలంగాణలో ఏ మూలన వున్న రైతులకైనా కొన్ని ఇబ్బందులున్నాయి. పైగా భూమి లక్షణాన్ని బట్టి గుణాన్ని బట్టి రైతులు ఏం పండించాలన్నది తెలుసు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ రాష్ట్రంలోనైనా, 1956లో ఏర్పాటైన ఉమ్మడి రాష్ట్రంలో కలిపి సుమారు 50 ఏళ్లపాటు పాలన సాగించింది. కాని తెలంగాణకు మాత్రమే ఉపయోపడే ఒకే ఒక్క ప్రాజెక్టు నిర్మాణం చేసింది. అది కూడా కొన్ని దశాబ్దాల పాటు నిర్మాణం సాగించింది. కాని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో నిర్ణీత సమయంలో పూర్తి చేసిన ప్రాజెక్టు ఒక్కటీ లేదు. అంతెందుకు అప్పుడెప్పుడో దశాబ్ధాల క్రితం శంకుస్ధాపన రాళ్లు వేసిన పెండింగ్ ప్రాజెక్టులు తెలంగాణ వచ్చేదాకా పూర్తి చేయలేదు. ఎల్లంపల్లి కట్టింది మేమే అని చెబుతున్నారు. కాని ఎల్లంపల్లిని నిర్ణీత గడువులో ఎందుకు పూర్తి చేయలేదు. కాంగ్రెస్ ప్రారంబించిన ఏ ప్రాజెక్టుకైనా నిర్ణీత గడువును నిర్ణయించారా? ఆ గడువులోపు నిర్మాణం చేశారా? ఎన్నికల మీద ఎన్నికలు పోవడం, ప్రతీసారి వచ్చే ఎన్నికల నాటికి పూర్తి చేస్తామని చెప్పడం తప్ప పూర్తి చేసింది. ఆఖరుకు 2005లో మొదలు పెట్టిన జలయజ్ఞంలో తొలి ప్రాదాన్యత తెలంగాణకే అన్నారు. కాని తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. కాని ఏపిలో శ్రీకాకుళం జిల్లాలో జలయజ్ఞం తొలి ఫలితం అని ఝంజావతి ప్రాజెక్టును పూర్తి చేసిన జాతికి అంకింతం చేశారు. దేశంలోనే తొలి రబ్బరు డ్యామ్‌గా చరిత్ర సృష్టించామని చెప్పుకున్నారు. కాని తెలంగాణలో మాత్రం ఒక్కటి కూడా 2014వరకు పూర్తి చేయలేదు. ప్రాణహిత చేవెళ్ల అంటూ ఊదరగొట్టారు. తుమ్మిడి హెట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మాణం చేస్తామన్నారు. పొరుగున అప్పుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్‌బి. చౌహాన్ వున్నారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వుంది. అందువల్ల ప్రాజెక్టుకు అనుమతులు అడ్డంకులు వుండే అవకాశం లేదని ఊదరగొట్టారు. మహారాష్ట్రతో సంబంధం లేకుండా ప్రాజెక్టు వచ్చినట్లే అని పిట్ట కథలు కట్టు కథలు చెప్పారు. కాలువల నిర్మాణం అంటూ తెలంగాణ జనాన్ని నమ్మించారు. తెలంగాణ రాష్ట్ర అవసరమేముందని ప్రచారం చేశారు. బిఆర్‌ఎస్‌పై నీలాపనిందలు వేశారు. తీరా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తే సమేమిరా? అన్నారు. తుమ్మిడి హట్టి దగ్గర నిర్మాణానికి మేమెలా అనుమతి ఇస్తామని మహారాష్ట్ర తేల్చి చెప్పింది. ఎలాంటి చర్చలకు అంగీకారం లేదని సూటిగా ముఖంమీద చెప్పింది. ఇందులో కేంద్ర పెద్దల జోక్యం కూడా అవసరంలేదని మహారాష్ట్ర చెప్పింది. దాంతో తుమ్మిడి హట్టి తుమ్మితే ఊడిపోయినంత పని అయ్యింది. 153 అడుగుల ఎత్తులలో ప్రాజెక్టు నిర్మాణం చేస్తామన్నారు. మహారాష్ట్ర 149 అడుగులు నిర్మాణం చేసుకుంటే సహరిస్తామన్నారు. మరి ఎందుకు తుమ్మిడి హట్టి దగ్గర నిర్మాణం చేయలేదు. పదేళ్ల పాటు ఎందుకు కాలయాపన చేశారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఎందుకు మౌనంగా వున్నారు. ఓ వైపు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలోనైనా కనీసం తుమ్మిడి హట్టి నిర్మాణం చేద్దామని ఎందుకు అనుకోలేదు. ఉమ్మడి పాలకుల మీద ఎందుకు ఒత్తిడి చేయలేదు. ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాన్ని పూర్తి చేయాలని ఎందుకు అప్పటి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయలేదు. నిజం చెప్పాలంటే తెలంగాణ వచ్చిన తర్వాత కేసిఆర్ అంత పెద్ద కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం మూడేళ్లలో పూర్తి చేశారు. కనీసం కాంగ్రెస్ ఒక్క తుమ్మిడిహట్టి కూడా పదేళ్లలో నిర్మాణం చేయలేకపోయింది. కారణం నిర్మాణం చేయడం ఇష్టలేక ఉమ్మడి పాలకులు సిద్దంగా లేక ఆగిపోయింది. మరి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఏం చేశారు? తుమ్మిడి హట్టి నిర్మాణం కోసం ఎందుకు ఒత్తిడి చేయలేదు. తమ పదవులను ఎందుకు వదులుకోలేదు. ఎందుకంటే అప్పుడు తెలంగాణ నాయకులకు పదవుల మీద వున్న ద్యాస తెలంగాణ సాగు మీదలేదు. ఇప్పుడూ అంతే కాళేశ్వరం పనికి రాకుండాపోయిందే అనుకుందాం? మరి అదికారంలోకి వచ్చిన వెంటనే మహారాష్ట్రతో ఒప్పందం చేసుకొని తుమ్మిడి హట్టి నిర్మాణం ఎందుకు మొదలు పెట్టలేదు. మహారాష్ట్ర ఇచ్చిన హామీ మేరకైనా సరే 147 అడుగుల ఎత్తు నిర్మాణం మొదలు పెడితే కనీసం ఇప్పటి వరకు పూర్తయ్యేది. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నదన్న పేరైనా మిగిలేది. ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగమన్నట్లు ఇప్పుడు చర్చల కోసం ప్రయత్నం చేస్తామంటున్నారు. ఇప్పుడు గొప్ప గొప్ప స్ధానాలలోవున్న వాళ్లే ఉమ్మడి రాష్ట్రంలో కూడ కీలకంగా పనిచేశారు. కీలక నాయకులుగా చెలామణి అయ్యారు. తెలంగాణకు నీళ్లివ్వడం కష్టమని ఆంద్రా నాయకులు చెబితే తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తలలు ఊపారు. వారు చెప్పిన లెక్కలు మాత్రమే నిజమని నమ్మారు. తెలంగాణకు నీళ్లు ఎలా ఇవ్వొచ్చో అనేదానిపై కొన్ని దశాబ్ధాల తరబడి మేధావులు ఎంత మంది చెప్పినా తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పెడ చెవిన పెట్టారు. అప్పటి ఉమ్మడి పాలకుల మీద ఒత్తిడి చేయలేక చేతులు ముడుచుకొని కూర్చున్నారు. మేధావులు తెలంగాణకు నీళ్లు ఎలా ఇవ్వొచ్చొ అనేదానిపై ఎన్ని సూచనలు చేసినా వినేందుకు కూడా సిద్దపడలేదు. పైగా అప్పటి తెలంగాణ మేదావుల మీద రకరకాల ముద్రలు వేశారు. వారి గొంతు నొక్కారు. అటు వంటి సమయంలో కూడా తెలంగాణ కాంగ్రెస్ నాయకులు నోరు మెదిపింది లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను వ్యక్తం చేస్తున్న మేధావుల మీద కేసులు నమోదు చేయొద్దని వారించే ప్రయత్నం కూడా చేయలేదు. చేష్టలుడిగి దశాబ్ధాల పాటు కళ్లు మూసుకున్నారు. పదవులిస్తే చాలు అనుకున్నారు. అప్పుడు అలా నీళ్లు ఇవ్వలేకపోయారు. ఇప్పుడు నీళ్లున్నా, ప్రాజెక్టులు పని చేస్తున్నా నీళ్లు ఇవ్వడం లేదు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీయే ప్రజా ప్రభుత్వం రూపంలో అధికారంలో వుంది. కాని రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేస్తోంది. నీళు ఎత్తిపోస్తే కరంటు ఖర్చు అవుతుందంటారు? అసలు గోదారిలో నీళ్లే లేవంటారు. ఆంద్రాకు తరలిపోతున్న నీళ్లను ఎత్తిపోయమంటే కాలయాపన చేస్తున్నారు. ఓవైపు తెలంగాణలో పంటలు పొట్టకొచ్చే సమయంలో నీళ్లు లేకపోతే ఎండిపోతాయని మధన పడుతుంటే చూస్తూ వున్నారు. ఓ వైపు ఎల్‌నినోతో కరువు ముంచుకొచ్చినా రిజర్వాయర్లు నింపేందుకు వీలున్నా నింపడం లేదు. 50 టిఎంసిల సామర్ధ్యం వున్న మల్లన్న సాగర్ లో కనీసం పది టిఎంసిల నీళ్లు కూడా లేవంటున్నారు. 25 టిఎంసిల సామర్ధ్య వున్న దిగువ మానేరులో కనీసం ఏడు టిఎంసి నీళ్లు కూడా లేవంటున్నారు. అప్పర్ మానేరు, మిడ్ మానేరులో కూడా నీళ్లు అంతంత మాత్రమే అని చెబుతున్నారు. రంగ నాయక సాగర్, కొండ పోచమ్మ సాగర్,లలో కూడా ఒకటి రెండుటిఎంసిలకు మించి నీరు లేదంటున్నారు. ఆఖరుకు నగరానికి మంచినీటికి కూడా అవసరమైన నీళ్లు తరలించాలని కోరుతున్నారు. మేడిగడ్డ, అన్నారం , సుందిళ్ల వినియోగిస్తే ఎన్నికల ముందు చెప్పింది తప్పవుతుంది. ఇంత కాలం చెప్పిన ముచ్చట్లన్నీ అబద్ధమని తేలుతుంది. రాజకీయ పట్టుదల కోసం రైతులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నా ప్రభుత్వం లెక్క చేయడంలేదు. కరువు కాటు కోసం నిరీక్షిస్తోంది. ఖరీఫ్‌లోనే పంట చేతికి రాకపోతే, ఇక రబీ సంగతి ఏమిటని రైతు దిగాలు పడుతున్నాడు.



22ND ANNIVERSARY

# నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక



బుధవారం 02-09-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 142 రూ॥ 6.00






ఈఆర్ఓ కార్యాలయం వద్ద రద్దీ



కౌంటర్ వద్ద అధికారులు – ఓటర్లు



ఇంటింటికీ వివరాలు నమోదు చేస్తున్న BLO



డేటా ఎంట్రీ చేస్తున్న ఉద్యోగి








చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888





# ప్రహసనంగా మారిన నోటీసుల జారీ

# అధికార్ల తప్పిదాలకు ఓటర్లు బలి




- పనులు వదిలేసి ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న జనం
- గంటలకొద్దీ వేచివుండాల్సి రావడంతో తలపట్టుకుంటున్న ఓటర్లు
- ఆటోమేటెడ్ ట్రాన్స్ లేషన్ సాఫ్ట్ వేర్ పుణ్యమాని గుర్తుపట్టలేని స్థితిలో పేర్లు
- గ్రామీణ ప్రాంతాల్లో బీఎల్ ఓల తప్పిదాలతో మరీ ఘోరం
- లబోదిబో మంటున్న ఓటర్లు
- ఈ తప్పులు సహజమేనంటున్న అధికార్లు
- ఓటు పోతే మళ్లీ దరఖాస్తు చేసుకోక తప్పదు
- ఈ తప్పులేంటి?...ఈ తిరుగుడేంటి? ..అని ప్రశ్నిస్తున్న ఓటర్లు
- రాజకీయ పార్టీల్లో అసంతఅప్తి

**హైదరాబాద్, నేటిధాత్రి:**
తెలంగాణలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్–2026)ప్రక్రియ ప్రస్తు తం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర గందరగోళానికి, ఓటర్లలో ఆందోళనకు దారితీస్తోంది. ఒకవైపు రాజకీయ నేతలు, ఎమ్మెల్సీ పోటీదారులకు నోటీసులు అందుతుండగా, మరోవైపు మునుపటి ఓటరు జాబితాలతో పోలిస్తే పేర్లు మారిపోవడం, నియోజకవర్గాల మార్పులు, క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ ఆఫీసర్ల నిర్లక్ష్యం వంటి అంశాలు ఓటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ సవరణ ప్రక్రియ ఎంత తీవ్రంగా ఉందంటే, సాధారణ ఓటర్లతో పాటు రాజకీయ నాయకులు, రాబోయేఎంఎల్‌సీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులకు సైతం ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. మునుపటి జాబితాలోని వివరాలతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం లేదా తప్పులు ఉన్నాయనే కారణంతో వీరందరినీ స్వయంగా హాజరుకావాలని కోరుతున్నారు. దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ, ప్రజాప్రతినిధులుగా ఉన్నవారి వివరాలపైనే అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర కలకలం రేగుతోంది.



## ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న ఓటర్లు

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు ఒరిజినల్ డాక్యుమెంట్లుపట్టుకుని మున్సిపల్ కార్యాలయాలు, ఈఆర్వో ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఆన్‌లైన్‌లో పత్రాలు సమర్పించే వీలున్నా, తుది విచారణ కోసం ఓటరు లేదా వారి బంధువులు స్వయం గా ఈఆర్ ఓ లేదా ఏఈఆర్ ఓ లేదా మున్సిపల్ కేంద్రాల్లోని అధికారుల ఎదుట హాజరుకావాలని నిబంధనలు పెట్టడం గందరగోళాన్ని పెంచింది. ఒకేసారి లక్షలాది మందికి నోటీసులు జారీ చేయడం, ఆ నోటీసులలో విచారణ జరిపే ఖచ్చితమైన వేదిక, సమయం స్పష్టంగా పేర్కొనకపోవడంతో మున్సిపల్ కార్యాలయాల వద్ద ఓటర్లు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఉద్యోగం లేదా చదువుల కోసం వేరే ప్రాంతాల్లో ఉన్నవారు సైతం ఓటు కోసం సొంత ఊర్లకు పరుగెత్తుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.



## పేర్లు, ఇంటినెంబర్లు తల్లక్రిందులు

మునుపటి ఓటర్ల జాబితాలతో పోలిస్తే.. ప్రస్తుత ముసాయిదా జాబితాలో గ్రామాలు మరియు పట్టణాల్లోని ఓటర్ల పేర్లు, ఇంటి నంబర్లు, వయస్సు తలకిందులయ్యాయి. ఇంగ్లీష్ నుండి తెలుగులోకి పేర్లు మార్చే ప్రక్రియలో సాఫ్ట్‌వేర్ లోపాల వల్ల చాలా మంది అసలు పేర్లు మారిపోయి వింత వింత పేర్లు జాబితాలోకి వచ్చాయి. చాలా ప్రాంతాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ఇళ్లకు వెళ్లి సర్వే చేయకుండా, కార్యాలయాల్లో కూర్చునే తప్పుడు నివేదికలు ఇచ్చారని, దీనివల్ల వందలాది మంది అసలైన ఓటర్ల పేర్లు 'వలస వెళ్లారు' లేదా 'మరణించారు' అనే కేటగిరీల కింద ముసాయిదా నుండి తొలగించబడ్డాయని రాజకీయ పార్టీల నేతలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. చిన్నపాటి తప్పులకే నేరుగా నోటీసులు పంపడం మరియు వేలాది ఓట్లను ఒకేసారి హోల్‌సేల్‌గా డిలీట్ చేయడంతో, "మేము నిజమైన ఓటర్లమే అయినా మా ఓటును తొలగిస్తా రా?" అనే భయం ప్రజల్లో పట్టుకుంది. బోగస్ ఓట్లను ఏరివేయాలనే ఉద్దేశం మంచిదే అయినప్పటికీ, అధికారుల మరియు బీఎల్ ఓల నిర్లక్ష్యం వల్ల అర్హులైన పౌరులు తమ ప్రాథమిక హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.
తెలంగాణలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తెలుగు పేర్ల త ప్పుల తడక అనేది ప్రస్తుతం ఓటర్లను అత్యంత తీవ్రమైన అయోమయానికి గురిచేస్తున్న ప్రధాన సమస్యగా మారింది. ఇంగ్లీష్ నుండి తెలుగులోకి వివరాలను మార్చే క్రమంలో జరిగిన సాంకేతిక లోపాలు, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల లక్షలాది మంది అసలైన ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి.




## సాఫ్ట్ వేర్ మాయాజాలంతో పేర్లు తారుమారు

ఎన్నికల సంఘం ఉపయోగించిన కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, ఇంగ్లీష్ పేర్లను తెలుగులోకి ఆటోమేటిక్‌గా మార్చే క్రమంలో అక్షర దోషాలను సరిగ్గా గుర్తించలేకపోయింది. దీనివల్ల ఎంతో మంది ఓటర్ల పేర్లు, వారి తండ్రి లేదా భర్త పేర్లు పూర్తిగా తారుమారయ్యాయి. ఉదాహరణకు, దీర్ఘాలు మారడం, ఒత్తులు తప్పుగా పడటం, మరియు ఇంటి పేర్లు అసలు పేర్లతో కలిసిపోయి వింత వింత పదాలుగా రూపాంతరం చెందాయి. పేర్ల అనువాదంలో జరిగిన గందరగోళం వల్ల, ఒకరిఓటరు ఐడీ నెంబర్ మరియు ఫోటో పక్కన మరొకరి పేరు తెలుగులో ప్రింట్ అయినట్లు క్షేత్ర స్థాయి పరిశీలనలో బయటపడింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు స్లిప్పులు పంచేటప్పుడు లేదాఆన్‌లైన్‌లో వెతికేటప్పుడు, తమ ఒరిజినల్ ఐడీ కార్డులో ఉన్న పేరుకు, ముసాయిదా లిస్ట్‌లో ఉ న్న పేరుకు అస్సలు సంబంధం లేకపోవడంతో ఓటర్లు తమ పేరు జాబితాలో ఉందో లేదో కూ డా తెలుసుకోలేకపోతున్నారు. ఈ విధంగా తెలుగు పేర్లు తప్పుగా పడటాన్ని సాఫ్ట్‌వేర్ 'అనామలీ'(వివరాల్లో తప్పులు) గా గుర్తించింది. తప్పు అధికారుల వైపు నుండి జరిగినప్పటికీ, శిక్ష మాత్రంఓటరుకు పడినట్లు అయింది. మీ పేరు తప్పుగా ఉందంటూ ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేస్తుండటంతో, ఓటర్లు తమ ఆధార్ కార్డు, టెన్త్ మెమో లేదా ఇతర ఒరిజినల్ పత్రాలను పట్టుకుని మున్సిపల్ కార్యాలయాలు, ఈఆర్ ఓ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికీ వచ్చి ఈ తెలుగు పేర్ల తప్పులను ఓటర్ల సమక్షంలో సరిచూడాల్సి ఉంది. కానీ, చాలా చోట్ల వీరు క్షేత్రస్థాయికి రాకుండానే, సిస్టమ్ జనరేట్ చేసిన తప్పుడు పేర్ల జాబితాలనే ముసాయిదాగా ఖరారు చేసేశారు. దీనివల్ల తప్పులు అలాగే ఉండిపోయి, ఇప్పుడు ఓటు హక్కుకే ముప్పు తెచ్చేలా మారాయి.




బీఎల్ ఓలు చేసిన తప్పుల వల్ల ఇప్పుడు సాధారణ పౌరులు మున్సిపల్ ఆఫీసులు, ఈఆర్వో కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కూలీ పనులు, ఉద్యోగాలు వదులుకుని ఓటును నిలబెట్టుకోవడానికి లైన్లలో నిలబడుతున్నారు. నోటీసులు అందిన కొద్ది రోజుల్లోనే విచారణకు హాజరుకావాలని అధికారులు గడువు విధించడంతో, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లక్షలాది మంది సాధారణ పౌరులు తమ ప్రాథమిక హక్కు అయిన ఓటును కాపాడుకోవడానికి పనులన్నీ వదులుకుని మున్సిపల్, ఈఆర్వో ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో "తప్పు ఎవరిది? శిక్ష ఎవరికి?" అనే ప్రశ్న రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఓటరు గుండెల్లోమెదులుతోంది.



## మూడు వర్గాల నిర్లక్ష్యం ఇందుకు ప్రధాన కారణం

ఈ భారీ గందరగోళానికి ప్రధానంగా మూడు వర్గాల నిర్లక్ష్యం, సాంకేతిక లోపాలు కారణమని స్పష్టమవుతోంది. ఇంగ్లీష్ నుండి తెలుగులోకి ఓటర్ల వివరాలను మార్చడానికి వాడిన ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్ పూర్తిగా విఫలమైంది. పేర్లలోని అక్షరాలను, ఒత్తులను, దీర్ఘాలను తప్పుగా అనువ దించి, అసలైన ఓటర్ల పేర్లను 'తప్పుల తడక'గా మార్చిన ప్రాథమిక తప్పు ఎన్నికల సంఘం ఐటీవిభాగానిదే. నిబంధనల ప్రకారం ప్రతి ఇంటికీ వెళ్లి, ఓటర్ల సమక్షంలో ముసాయిదా వివరాల ను క్రాస్–చెక్ చేయాలి. కానీ మెజారిటీ ప్రాంతాల్లో బీఎల్ ఓలు క్షేత్రస్థాయికి వెళ్లకుండా, ఆఫీసుల్లోనే కూర్చుని తప్పుడు నివేదికలు ఇచ్చారు. ఒకే ఇంట్లో దశాబ్దాలుగా ఉ ంటున్న వారిని కూడా 'వలస వెళ్లారు' లేదా 'లేరు' అని తేల్చడం వీరి అతిపెద్ద తప్పు. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు తమకు అనుకూలంగా లేని ఓటర్ల వివరాలపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఫిర్యాదులు చేయడం, వాటిని అధికారులు గుడ్డిగా నమ్మి నోటీసులు జారీ చేయడం కూడా ఈ గందరగోళాన్ని పెంచింది. తప్పులన్నీ వ్యవస్థ, అధికారులు చేస్తే... దానికి శిక్ష మాత్రం నిజమైన, అమాయక ఓటరు అనుభవిస్తున్నాడు. రోజూ కూలీకి వెళ్తేనే ఇల్లు గడిచే పేదలు, ప్రైవేట్ ఉద్యోగులు తమ జీతాలు, పనులు వదులుకుని ఆధార్ కార్డులు, సర్టిఫికెట్లు పట్టుకుని మున్సిపల్ ఆఫీసుల ముందు గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. నడవలేని స్థితిలో ఉన్నవఅద్ధులను, వికలాంగులను సైతం "స్వయంగా విచారణకు హాజరుకావాలి" అంటూ అధికారు లు నిబంధనలు పెట్టడం అత్యంత అమానవీయంగా మారింది. "నా ఓటు ఉంటుందా? ఊడు తుందా?", "నోటీసు వచ్చింది.. నేను ఏ నేరం చేశానని నన్ను పిలుస్తున్నారు?" అనే భయం, అభద్రతా భావం గ్రామీణ ప్రాంతాల ఓటర్లలో తీవ్ర మానసిక ఆందోళనను కలిగిస్తోంది. ఇదే గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ ముఠాలు "మీ ఓటు డిలీట్ అయింది, లింక్ నొక్కి ?5 కట్టండి" అంటూ నకిలీ మెసేజ్‌లతో ఓటర్ల బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నాయి. తప్పు అధికారులదైతే, ఆర్థికంగా నష్టపోతోంది ఓటరే.






ఆఫీసు ముందు ఓటర్ల భారీ క్యూ




## నోటీసులు బీఎల్ఓలే స్వయంగా అందించాలి: సీఈవో సుదర్శన్ రెడ్డి

## చిత్ర విచిత్ర పేర్లు

మీడియా నివేదికలు, మరియు పౌర హక్కుల నెట్‌వర్క్ 'అదాలత్' వంటి సంస్థల సర్వేల ప్రకా రం విచిత్రమైన, దారుణమైన ఉదాహరణలు బయటపడ్డాయి. రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ / శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మణికొండకు చెందిన 'వాసిరెడ్డి వెంకట నరేశ్' అనే ఓటరు పేరు సాఫ్ట్‌వేర్ పుణ్యమా అని ముసాయిదా జాబితాలో "వెంకట నరీషు"గా మారిపోయింది. ఖమ్మం జిల్లాలోని ఒక గ్రామీణ నియోజకవర్గంలో ఒక ఓటరు ఇంటిపేరు "సుడిగాలి" కాగా, అది తెలుగు లిస్ట్‌లో "సుడిగాలియా"గా రూపాంతరం చెందింది. హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ల నిర్లక్ష్యం వల్ల ఓటరు తండ్రి పేరు ఉండాల్సిన కాలమ్‌లో వారి తాత పేరు వచ్చి చేరింది. దీనివల్ల వారి అసలు కుటుంబ లింకులు పూర్తిగా తారుమారయ్యాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి ప్రాంతానికి చెందిన ఒక ఓటరు తన అ డ్రస్ రాయగా, అది రికార్డులలో "బచ్చుపల్లి"గా మారిపోయింది. శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ (ఐటీ హబ్ ప్రాంతాలు) ప్రాంతాల్లో ఆన్‌లైన్ ఎన్యూమరేషన్ ఫారాలు ఎక్కువగా సేకరించడం వల్ల ఇంగ్లీష్ నుండి తెలుగులోకి మారేటప్పుడు అక్షర దోషాలు వెల్లువలా వచ్చాయి. పేరు చివర ఉండే 'రావు' అనేది 'రాయో' అని, 'రెడ్డి' కి బదులు 'రెద్ది' అని తప్పుగా పడ్డాయి. కార్వాన్, మలక్‌పేట్, చాంద్రాయణగుట్ట (పాతబస్తీ నియోజకవర్గాలు) ప్రాంతాల్లో ఉర్దూ మరియు ఇంగ్లీష్ పేర్లను తెలుగు ముసాయిదాలోకి మార్చే క్రమంలో తీవ్రమైన స్పెల్లింగ్ మిస్టేక్స్ దొర్లాయి. ఉ దాహరణకు, ఖాన్ అనే పేరు 'కానీ' గా, బేగం అనేది 'బేగాము'గా మారి ఓటర్లు తమ పేర్లను వెతు క్కోవడం కష్టమైపోయింది. ఖమ్మం మరియు వరంగల్ గ్రామీణ నియోజకవర్గాల్లో గ్రామాల్లో స్థానిక బీఎల్ ఓలు నిరక్షరాస్యులైన ఓటర్ల వివరాలను తప్పుగా ఎంటర్ చేయడం, లేదా ఇంగ్లీష్ సరిగ్గా టైప్ చేయకపోవడంతో తెలుగు అనువాదాలు పూర్తిగా మారిపోయి 'అనామలీస్' లిస్ట్‌లోకి వెళ్లాయి. ఇలాంటి వింత పేర్లు చూసి ఓటర్లు తలపట్టుకుంటుంటే, అధికారులు మాత్రం "ఇంగ్లీష్ నుండి ఆటోమేటిక్‌గా తెలుగులోకి మారినప్పుడు ఇలాంటి తప్పులు సహజమే, దీనికి కంగారుపడాల్సిన పనిలేదు" అని సర్దిచెబుతున్నారు.

## రాజకీయ పార్టీల అసంతఅప్తి




హైదరాబాద్ సహా పలు ప్రాంతాలలో అర్హులైన ఓటర్లతో పాటు తమ పార్టీకి చెందిన కీలక స్థానిక నాయకులను టార్గెట్ చేస్తూ 'షిఫ్టెడ్' లేదా 'అనామలీస్' కింద నోటీసులు ఇస్తున్నారని, బీఎల్ ఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ ఎస్ఎమ్మెల్సీలు మరియు సీనియర్ నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు.కేవలం విచారణకు 48 గంటల ముందే నోటీసులు జారీ చేసి, కార్యాలయాలకు స్వయంగా హాజరుకావాలని నిబంధనలు పెట్టడం వల్ల పోటీదారు లు, సాధారణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ నేతలు కూడా దీనిపై అసంతఅప్తి వ్యక్తంచేయడం తాజా పరిణామం.



# నేటిధాత్రి®

22ND ANNIVERSARY

తెలుగు వార్త పత్రిక



బుధవారం 02-09-2026 పేజీలు : 08 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 142 రూ॥ 6.00



# Issuance of notices turns into a farce







1 VOTERS QUEUE OUTSIDE OFFICE FOR CORRECTIONS Long queues, confusion and frustration as voters seek corrections in the list


- Voters bear the brunt of official errors
- People forced to neglect work and make rounds of government offices
- Voters exasperated by hours of waiting
- Names rendered unrecognizable due to automated translation software
- Situation dire in rural areas due to errors by Booth Level Officers (BLOs)
- Voters in distress



2 VOTER RECEIVES NOTICE Checking notice along with Aadhaar and Voter ID



3 E.R.O OFFICE SCENE Crowded counters, long wait and clarification process


4 BLO FIELD VERIFICATION House-to-house verification of voter details


5 VOTER LIST WITH ERRORS Wrong names, father's names, house numbers in the list



6 SOFTWARE / DATA ENTRY ISSUES Automated translation and data entry errors causing incorrect names



## • Officials dismiss errors as routine • No option but to re-apply if the vote is lost

### • Voters question the nature of these errors and the hassle of running around • Dissatisfaction among political parties

**Hyderabad, NetiDhathri :**
The Special Summary Revision (SSR-2026) of the voter list currently underway in Telangana is causing widespread confusion and anxiety among voters. While political leaders and aspiring MLC candidates are receiving notices, voters are facing severe difficulties due to issues such as altered names compared to previous lists, changes in constituencies, and negligence by Booth Level Officers (BLOs) at the field level. The scale of this revision process is such that election officials are issuing notices not only to ordinary voters but also to political leaders and candidates intending to contest the upcoming MLC elections. They are being asked to appear in person because current details do not match those in the previous list or contain errors. The fact is that officials are raising objections regarding the details of individuals who have been in politics and serving as public representatives for decades has caused a stir within political circles.

**Voters Making Rounds of Offices**

Voters who received notices are forced to make rounds of municipal offices and Electoral Registration Officer (ERO) offices with original documents to safeguard their voting rights. Although documents can be submitted online, the requirement for the voter or their relatives to appear in person before the ERO, Assistant ERO (AERO), or municipal officials for a final inquiry has created confusion. With notices issued to lakhs of people simultaneously—and without clearly specifying the exact venue or time for the inquiry—voters are having to wait for hours at municipal offices. A situation has arisen where even those living elsewhere for work or education are compelled to rush back to their hometowns to secure their vote.

**Discrepancies in Names and House Numbers**

Compared to previous electoral rolls, the current draft list contains errors where names, house numbers, and ages of voters in both rural and urban areas have been jumbled or recorded incorrectly. Software glitches during the transliteration of names from English to Telugu have altered many genuine names, resulting in bizarre or incorrect names appearing on the list. Leaders of political parties are openly alleging that in many areas, Booth Level Officers (BLOs) submitted false reports from their offices instead of conducting field-level door-to-door surveys; consequently, the names of hundreds of genuine voters were removed from the draft list under categories such as "migrated" or "deceased." With notices being issued for minor errors and thousands of votes being deleted en masse, a fear has gripped the public: "Will our votes be deleted even though we are genuine voters?" Civil society groups warn that while the intention to weed out bogus votes is noble, the negligence of officials and BLOs puts eligible citizens at risk of losing their fundamental right to vote.

A major issue currently causing severe confusion among voters during the special summary revision of the electoral roll in Telangana is the prevalence of errors in Telugu names. Due to technical glitches during the conversion of details from English to Telugu and a lack of proper official oversight, the names of lakhs of genuine voters in the draft list have been altered to the point of being unrecognizable.

**Names Garbled Due to Software Glitch**

The computer software used by the Election Commission failed to accurately handle character variations while automatically transliterating English names into Telugu. Consequently, the names of many voters—as well as the names of their fathers or husbands—became completely distorted. Issues included incorrect vowel markers, misplaced consonant clusters, and the merging of surnames with given names to form bizarre, nonsensical words. Field inspections revealed that, due to this transliteration chaos, a specific voter's ID number and photograph were sometimes paired with a completely different name in the printed Telugu version. When checking online or receiving voter slips at polling stations, voters are unable to verify their presence on the list because the names in the draft roll bear no resemblance to those on their original ID cards. The software flagged these Telugu name errors as "anomalies" (data discrepancies). Although the errors originated with the authorities, the burden of rectification has fallen on the voters. As election officials issue notices regarding these name discrepancies, voters are forced to make repeated visits to municipal offices and Electoral Registration Officer (ERO) offices, carrying their Aadhaar cards, 10th-grade mark sheets, or other original documents. Booth-level officers are required to visit households and verify these Telugu name errors in the presence of the voters. However, in many instances, instead of conducting field-level verifications, officials finalized draft lists based on erroneous names generated by the system. Consequently, these errors persisted and now threaten the very right to vote.

Due to the errors committed by Booth Level Officers (BLOs), ordinary citizens are now forced to make repeated visits to municipal offices and Electoral Registration Officer (ERO) centres. They are abandoning their daily wage work and jobs to stand in queues just to safeguard their voting rights. With officials setting tight deadlines for appearing at hearings after the receipt of notices, people in rural areas are deeply anxious. Hundreds of thousands of ordinary citizens are setting aside their livelihoods and making exhausting rounds of municipal and ERO offices to protect their fundamental right to vote. Against this backdrop the question "Whose fault is it? Who is being punished?" is weighing heavily on the minds of voters across the state.

**Negligence by three groups is the primary cause**

It is evident that negligence by three groups and technical glitches are the main reasons for this massive chaos. The automated software used to transliterate voter details from English to Telugu failed completely. The Election Commission's IT wing committed the fundamental error of incorrectly translating characters, diacritics, and vowel lengths, thereby turning genuine voter names into a jumble of errors. According to regulations, officials are required to visit every household and cross-verify the draft details in the presence of the voters. However, in most areas, Booth Level Officers (BLOs) failed to conduct field visits; instead, they sat in their offices and submitted erroneous reports. A major blunder was classifying residents who had lived in the same house for decades as having "migrated" or being "absent." The confusion was further compounded in certain constituencies where local politicians and booth-level agents lodged deliberate, false complaints against voters unfavourable to them—complaints that officials blindly accepted before issuing notices. While the system and officials committed the errors, it is the genuine, innocent voter who bears the brunt of the consequences. Daily-wage labourers—whose livelihoods depend on working every day—and private-sector employees are forced to forgo their wages and work duties to stand for hours outside municipal offices, clutching Aadhaar cards and certificates. It is deeply inhumane for officials to insist that even the elderly and the differently-abled, who are physically unable to move about, must appear in person for verification. Voters in rural areas are gripped by anxiety and insecurity, constantly wondering, "Will my vote remain or be deleted?" or "I received a notice—what alleged offense am I being summoned for?" Capitalizing on this chaos, cybercrime gangs are draining voters' bank accounts using fraudulent messages claiming, "Your vote has been deleted; click this link and pay ¹ 5." Ultimately, while the fault lies with the officials, it is the voter who suffers the financial loss.

**Bizarre Names**

Media reports and surveys by organizations like the civil rights network 'Adalat' have revealed some strange and shocking examples. Thanks to software glitches, the name of a voter named 'Vasireddy Venkata Naresh' from Manikonda (in the Rajendranagar/ Serilingampally constituency of Ranga Reddy district) was altered to "Venkata Nareshu" in the draft electoral roll. In a rural constituency in Khammam district, a voter's surname



"Sudigali" was transformed into "Sudigalia" in the Telugu list. In several Hyderabad constituencies, the negligence of data entry operators resulted in the grandfather's name appearing in the column designated for the father's name, completely distorting actual family lineages. A voter from the Bachupally area in the Quthbullapur constituency found their address recorded as "Bacchupally" instead of the correct spelling. In the IT hub areas of Serilingampally and Quthbullapur, the large-scale collection of online enumeration forms led to a flood of spelling errors during the conversion from English to Telugu; for instance, the suffix "Rao" was recorded as "Rayo," and "Reddy" was misspelled as "Reddi." Severe spelling errors occurred during the process of transliterating Urdu and English names into Telugu in constituencies like Karwan, Malakpet, and Chandrayangutta (Old City areas). For instance, the name 'Khan' was rendered as 'Kaani' and 'Begum' as 'Begamu,' making it difficult for voters to locate their names. In the rural constituencies of Khammam and Warangal, errors arose because local Booth Level Officers (BLOs) entered details incorrectly or failed to type English names accurately; consequently, the Telugu transliterations were distorted, causing these entries to be flagged in the 'anomalies' list. While voters are baffled by these bizarre name spellings, officials are downplaying the issue, stating that such errors are natural during the automatic conversion from English to Telugu and that there is no cause for alarm.

**Dissatisfaction among Political Parties**


BRS MLCs and senior leaders have lodged complaints with the Chief Electoral Officer, alleging that BLOs are acting negligently and issuing notices under 'shifted' or 'anomalies' categories—targeting not only eligible voters but also key local leaders belonging to their party—in areas including Hyderabad. In a recent development, Congress leaders have also expressed dissatisfaction, pointing out that the practice of issuing notices just 48 hours prior to inquiries and mandating personal appearances at offices is causing significant inconvenience to contestants and the general public.



# నేటిధాత్రి®

22nd ANNIVERSARY

తెలుగు వార్త పత్రిక



బుధవారం 02-09-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 142 రూ॥ 6.00


## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరంగా ఉండండి
- దేశ ప్రజల సమిష్టి కృషితోనే జీడీపీ వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి

08 లో

## జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ



- ధరలు మోత మోగిస్తుంటే.. వృద్ధి ఎలా సాధ్యం?
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరాం రమేశ్

న్యూఢిల్లీ , నేటిధాత్రి:
భారత దేశ జీడీపీ 7.8

08 లో

## హైదరాబాద్... గ్లోబల్ నాలెడ్జ్ హబ్!



- ప్రపంచస్థాయి విద్యకు తెలంగాణను వేదికగా మారుస్తాం
- లండన్, నార్త్‌ఈస్టర్న్ వర్సిటీల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు
- హార్వర్డ్ సహా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌తో చర్చలు
- ఎంఐటీతో సంయుక్త పరిశోధనలు..
- సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ప్రణాళిక: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నేటిధాత్రి:
హైదరాబాద్‌ను ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా, గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను హైదరాబాద్‌కు ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు.
హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలు ఆఫ్ షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయని సీఎం వెల్లడించారు. ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. హార్వర్డ్ యూనివర్సిటీ సైతం తెలంగాణలో కోర్సులు, ప్రత్యేక విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతోందన్నారు.
ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. లండన్ బిజినెస్ స్కూల్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ చర్చలు ఫలప్రదంగా జరిగాయని వెల్లడించారు. అమెరికాకు చెందిన ఎంఐటీతో పాటు ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు జరిపినట్లు సీఎం తెలిపారు. తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి సంయుక్త పరిశోధనలు చేపట్టడంతో పాటు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు.
ప్రపంచ స్థాయి నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయడమే లక్ష్యంగా ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం పేర్కొన్నారు.
అంతర్జాతీయ విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాలు హైదరాబాద్‌లో ఏర్పాటవడం ద్వారా తెలంగాణ యువతకు దేశ, విదేశాల్లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.
"హైదరాబాద్‌ను ప్రపంచ విద్యా రంగంలో కీలక శక్తికేంద్రంగా నిలబెడతాం. తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన, ఉపాధి అవకాశాలు అందేలా హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఎంపీ ల్యాడ్స్‌పై అసత్య ప్రచారం వద్దు!

- ఎంపవర్డ్ ఇండియన్ నివేదిక సత్యదూరం: బండి సంజయ్

**రూ.17.50 కోట్లలో రూ.16.47 కోట్లు వినియోగించాం**



కరీంనగర్, నేటిధాత్రి:
ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులను ఎంపీలు పూర్తిగా వినియోగించుకోవడం లేదంటూ చేసిన ఆరోపణలు వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా చేసినవేనని మండిపడ్డారు.
కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి కేటాయించిన రూ.17.50 కోట్లలో ఇప్పటికే రూ.16.47 కోట్లు, అంటే 94.1 శాతం నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. స్థానిక ప్రజల విజ్ఞప్తుల మేరకు కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి 627 ప్రతిపాదనలు కలెక్టర్లకు పంపినట్లు వివరించారు.
వీటిలో 82.29 శాతం పనులకు కలెక్టర్లు ఆమోదం తెలిపారని, మిగిలిన పనుల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. గత ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ వినియోగించకుండా మిగిల్చిన రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు.
ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంలో ప్రతిపాదనలు, కలెక్టర్ల ఆమోదం, అధికారుల కార్యాచరణ, పనుల అమలు, పూర్తయ్యే వరకు అనేక దశలు ఉంటాయని చెప్పారు. ఇవేవీ పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలు నిధులు ఖర్చు చేయడం లేదని ఆరోపించడం సరికాదని స్పష్టం చేశారు.
"ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా ఏడు నెలల సమయం ఉన్నా.. నా వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులు మిగలలేదు. ప్రతిపాదనలన్నీ ఇప్పటికే కలెక్టర్లకు పంపాం" అని బండి సంజయ్ తెలిపారు.




## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ యధావిధిగా..!

**సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు**



**ప్రభుత్వానికి ఊరట.. పథకాల అమలుకు గ్రీన్‌సిగ్నల్**

హైదరాబాద్, నేటిధాత్రి:
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం మంగళవారం ఎత్తివేసింది. దీంతో ఈ రెండు పథకాలు యథావిధిగా కొనసాగనున్నాయి.


**కౌంటర్ దాఖలు చేయలేదంటూ స్టే**

2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. దీనిని సవాల్

08 లో

## కాంగ్రెస్ పాలనకు 1000 రోజులు.. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం!

- ఫీజు బకాయిలు చెల్లించక సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలు
- ఉద్యోగాలు, పైచదువులకు వెళ్లలేక విద్యార్థుల ఆవేదన
- మైకు దొరికితే ప్రతిపక్షాలపై విమర్శలా?.. పిల్లల గోస పట్టదా?
- తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: హరీశ్‌రావు



హైదరాబాద్, నేటిధాత్రి:
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం సాధించిన మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువగా ఉందనడానికి రోడ్డున పడుతున్న విద్యార్థుల భవిష్యత్తే ప్రత్యక్ష సాక్ష్యమని ఆరోపించారు.
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. కష్టపడి చదువుకున్నా సర్టిఫికెట్లు చేతికి రాక ఉద్యోగాలు, పైచదువుల అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
"మైకు దొరికితే ప్రతిపక్షాలను తిట్టడం, అసత్యాలు ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో విద్యార్థులు పడుతున్న గోసపై ఎందుకు లేదు?" అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. సిద్దిపేట శ్రీకృప కాలేజీతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సర్టిఫికెట్లు అందక ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి.. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని హరీశ్‌రావు కోరారు.

## కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

- కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లోకి వెళ్లే యత్నం చేయలేదా?
- స్వలాభం కోసం నిరాధార ఆరోపణలు చేయొద్దు: వేముల ప్రశాంత్‌రెడ్డి



నిజామాబాద్, నేటిధాత్రి:
కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురితో రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ

08 లో



## కేసీఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

- కేసీఆర్ అంటేనే రేవంత్‌కు భయం
- ఆంధ్రాకు నీళ్లు తరలిస్తున్నా అడ్డుకోలేని అసమర్థ సీఎం : జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు

సూర్యాపేట, నేటిధాత్రి:
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ

08 లో

## మిర్యాలగూడ రైతు ర్యాలీకి నో పర్మిషన్!

- ట్రాఫిక్ సమస్యలతో పోలీసుల అనుమతి నిరాకరణ
- గ్రౌండ్ లేదా ఫంక్షన్ హాల్లో సభకు అవకాశం



నల్లగొండ, నేటిధాత్రి:
మిర్యాలగూడలో బీఆరెస్ ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించ తలపెట్టిన రైతు ర్యాలీ, బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ, అనంతరం రాజీవ్ చౌక్‌లో సభ నిర్వహించేందుకు బీఆరెస్ నేతలు అనుమతి కోరారు. కేటీఆర్ ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది.
రాజీవ్ చౌక్ ప్రధాన కూడలి కావడం, రహదారులు ఇరుకుగా ఉండటం, వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం

08 లో

## విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోంది!

- రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్
- విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది: తలసాని




హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలోని లక్షలాది మంది విద్యార్థుల ఉన్నత చదువులను, వారి భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులు, విద్యార్థులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో తలసానిని కలిసి, ఫీజు

05 లో

## రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

- సింగిల్ బెంచ్ ఆదేశాలపై డివిజన్ బెంచ్ స్టే
- కమిషనర్‌ను మార్చాలన్న ఆదేశం తాత్కాలికంగా నిలిపివేత
- లోతుకుంట భూముల జోలికి వెళ్లొద్దని స్పష్టం
- తదుపరి విచారణ నవంబర్ 3కు వాయిదా



హైదరాబాద్, నేటిధాత్రి:
హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనను మార్చాలంటూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది.
సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ రంగనాథ్ దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్.. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు లోతుకుంట భూముల విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టవద్దని హైడ్రాకు స్పష్టం చేసింది. కేసు తదుపరి విచారణను నవంబర్ 3కు వాయిదా వేసింది. రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు.

## పెన్షన్లతో ఆర్థిక భరోసా

- కుటుంబంలో పెరిగిన గౌరవం
- ఇప్పటి వరకూ రూ.75,503 కోట్ల పెన్షన్లు ఇచ్చాం
- వీటితో మూడు పోలవరాలు కట్టగలం
- మంచి కోసం సూచనలు, సలహాలు స్వీకరిస్తా
- అభివృద్ధిని అడ్డుకుంటున్న గొడ్డలి పార్టీ
- మీ దీవెనలు ఇలాగే ఉంటే ఇంకా అభివృద్ధి చేస్తా
- మొగల్తూరు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు

భీమవరం, నేటిధాత్రి:
పెన్షన్లతో పేద కుటుంబాల్లో భరోసా నింపామని సీఎం చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఆయా కుటుంబాల్లో పెద్దలకు గౌరవం దక్కుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి డ్వాక్రా సంఘాలను స్థాపించామని సీఎం తెలిపారు. తన తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదని దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారని అన్నారు. భవిష్యత్తులో మగవారిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొచ్చారు.
వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ ఆదుకుంటున్నామన్నారు. దేశంలో నాలుగు వేలు, ఆరు వేలు, పది వేలు, పదిహేను వేల పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీనే అని అన్నారు. ఇప్పటి వరకూ రూ.75,503 కోట్లను పెన్షన్లుగా ఇచ్చామని.. ఆ డబ్బుతో మూడు పోలవరం ప్రాజెక్టులు కట్టవచ్చన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలని.. అందరికీ సంక్షేమం అందాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.
45 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు నరసాపురం వచ్చానని.. అనేక పాలనా సంస్కరణలకు నాంది పలికామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మొగల్తూరు తనకు కొత్తేమీ కాదన్నారు. మొగల్తూరులో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.
ప్రజా కార్యక్రమాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని విమర్శించారు. అటువంటి పరిస్థితి నుంచి 94 శాతం సీట్లలో, 54 శాతం ఓట్లతో కూటమిని ప్రజలు గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.




వడ్డెర సామాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యం షాపులు కేటాయిస్తున్నాం. డీఎస్సీపై వైకాపా 350 కేసులు వేసింది. వైకాపా చేస్తున్న ప్రచారాన్ని డీఎస్సీ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పెంచాం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుందని చంద్రబాబు అన్నారు.
కొన్ని రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని.. వాటిని మహిళలు నడపాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. డ్వాక్రా ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా చూస్తామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థిక సహాయాన్ని ఇవ్వడాన్ని తానే ప్రారంభించానని తెలిపారు.
ఎలాంటి మంచి పనులు చేసినా అడ్డుపడుతున్నారని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ఏజెన్సీలోని పిల్లలకు మెరుగైన విద్య అందిస్తే, ప్రపంచంలోనే మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. వాటన్నింటికీ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని విమర్శించారు. "ఎంత అడ్డుపడినా నా ఆశయాన్ని ఆపలేరు" అని స్పష్టం చేశారు. డీఎస్సీని అడ్డుకోవడానికి 350 పిటిషన్లు వేశారని.. పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తే, కోడిగుడ్డుకు ఈకలు పీకుతున్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారు గొడ్డలి పార్టీని హెచ్చరించినా వారిలో మార్పు లేదన్నారు.
త్వరలో ఏసీ బస్సులు వస్తున్నాయని.. మహిళలు ఉచితంగా ఆ బస్సుల్లో ఎక్కే రోజులు రాబోతున్నాయని తెలిపారు. మహిళలు ఇంటిపై సోలార్ పెట్టుకుంటే విద్యుత్ తయారవుతుందని.. దానివలన కొన్ని రోజుల్లో ఉచితంగా కరెంటు పొందవచ్చని సూచించారు. వేసవికాలంలో ఎండలు ఎక్కువ ఉంటాయి కాబట్టి.. ఏసీలు పెట్టుకోవచ్చని.. అదనంగా ఉండే విద్యుత్‌ను అమ్ముకోవచ్చని అన్నారు. ప్రతి ఇంట్లో ఒక చిన్న పారిశ్రామికవేత్త రావాలని 'వన్ హౌస్.. వన్ ఆంత్రప్రెన్యూర్' అనే పథకాన్ని తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. అందరూ ప్రయత్నం చేస్తే మార్పు ఖచ్చితంగా వస్తుందని.. అనుకుంటే సాధించగలుగుతారని చంద్రబాబు అన్నారు.
ఇప్పటికే 5 లక్షల 90 వేల ఇళ్లు పూర్తి చేశామని.. మరో ఐదు లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అప్పట్లో పరిశ్రమలను పారద్రోలారని.. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొచ్చారు.
వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బుధవారం గోదావరి నీటిని ఉత్తరాంధ్రకు తీసుకెళ్లబోతున్నామని.. చరిత్రను మార్చబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో గోదావరి, కృష్ణా, కావేరి నదులను అనుసంధానం చేస్తామని వెల్లడించారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం




- రీ-సర్వేను వేగవంతం చేయాలి.. ప్రతి భూయజమానికి చట్టబద్ధ హక్కులు
- ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ, హౌసింగ్‌పై మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష
- పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి.. సర్వేతో సంబంధం లేని సమస్యలపైనా దృష్టి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి.. సెప్టెంబరు 15లోగా గరిష్ఠంగా పూర్తి చేయాలి

నేటిధాత్రి, మహబూబాబాద్:
రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూ రీ-సర్వేను ప్రాధాన్యతగా తీసుకుని వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మహబూబాబాద్ ఐడీఓసీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.
సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు మురళీనాయక్, కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజ్, నాయని రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రీ-సర్వేకు గడువులు

రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను ప్రాధాన్యతా అంశంగా తీసుకుని వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను లక్ష్యంగా ఎంపిక చేసి మొదటి విడత సర్వేను నవంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. రెండో విడతను వచ్చే ఏడాది మార్చి నాటికి చేపట్టి.. రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా సర్వే చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.
నాన్-కెడస్ట్రల్, కెడస్ట్రల్ గ్రామాల్లో జరుగుతున్న రీ-సర్వే పురోగతిని సమీక్షించారు. విధులకు హాజరుకాని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండా సర్టిఫికెట్లు జారీ చేయడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

### 22-ఏ భూములపై నివేదిక

22-ఏ కింద ఉన్న భూములపై సర్వే నంబర్ల వారీగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో సమగ్ర నివేదికను రెండు రోజుల్లో సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పొరపాటున 22-ఏ జాబితాలో చేరిన అర్హులైన రైతుల భూములను పరిశీలించి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.
భూభారతి ద్వారా పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని, సాదా బైనామాలు తదితర సమస్యలను పరిష్కరించి అర్హులైన రైతులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని సూచించారు. అటవీ-రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలను సంయుక్త సర్వేతో శాశ్వతంగా పరిష్కరించాలన్నారు.

### దరఖాస్తులు పెండింగ్ పెట్టొద్దు

రైతుల భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల విషయంలో అనవసర జాప్యం



చేయవద్దని మంత్రి సూచించారు. సమస్యను పరిష్కరించి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. సర్వేతో సంబంధం లేని భూ సమస్యలను కూడా గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.

### ఇందిరమ్మ ఇళ్లకు వేగం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని మంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు ప్రభుత్వం సుమారు రూ.1,200 కోట్లు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఖర్చు చేసిందన్నారు. జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో పురోగతి సంతృప్తికరంగా ఉందని, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో నిర్మాణాలు ఆశించిన స్థాయిలో లేవని పేర్కొన్నారు.
పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సెప్టెంబరు 15 నాటికి గరిష్ఠ సంఖ్యలో ఇళ్లను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

### ఇసుక అక్రమ వసూళ్లపై చర్యలు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక అందించే వ్యవస్థలో అక్రమ వసూళ్లకు తావులేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. అదనపు రవాణా చార్జీల పేరుతో లబ్ధిదారుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా రేట్లను శాస్త్రీయంగా నిర్ణయించి సిస్టమ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇళ్ల మంజూరులో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### స్తోమత లేనివారికి సాంకేతికతతో ఇళ్లు

మంత్రి సీతక్క మాట్లాడుతూ గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు అత్యధిక సంఖ్యలో ఇందిరమ్మ, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇల్లు నిర్మించుకునే స్తోమత లేని వారికి జర్మనీ సాంకేతికతను ఉపయోగించి ఇళ్లు నిర్మించి ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

### జాకారం భూమిపై సర్వే

జాకారంలో ఉన్న భూమి అటవీ శాఖకు చెందిందా.. రెవెన్యూ శాఖకు చెందిందా అనే విషయాన్ని సర్వే ద్వారా తేల్చాలని మంత్రి సూచించారు. భూమి రెవెన్యూకు చెందినదిగా నిర్ధారణ అయితే అక్కడ పారిశ్రామిక ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు.

### చెరువుల భూములకు హద్దులు

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ వరంగల్‌లోని భద్రకాళి, చిన్నవడ్డేపల్లి తదితర చెరువుల భూములు ఆక్రమణలకు గురికాకుండా సరిహద్దులు నిర్ణయించాలని కోరారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో హైదరాబాద్ తరహా 'టవర్స్' కాన్సెప్ట్‌ను పరిశీలించాలని హౌసింగ్ ఎండీ వి.పి.గౌతమ్‌కు సూచించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేకుండా చూడాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ ఎన్టీఆర్ నగర్, సుందరయ్యనగర్ ప్రజలకు ప్రభుత్వ భూముల్లో పట్టాలు ఇచ్చేందుకు వారిని తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరగా.. మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
ప్రజలకు ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.
సమీక్షలో వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లు, సర్వేయర్లు, హౌసింగ్, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ, హౌసింగ్‌పై మంత్రి పొంగులేటి సుదీర్ఘ సమీక్ష

## పెండింగ్ దరఖాస్తులపై ఆగ్రహం..సత్వర పరిష్కారానికి ఆదేశం



- రీ సర్వే, భూభారతి పురోగతిపై కూలంకషంగా సమీక్ష
- ములుగు తహసీల్దార్‌పై తీవ్ర ఆగ్రహం..నెల్లికుదురు, మొగుళ్లపల్లి
- తహసీల్దార్లపై మండిపాటు
- భూపాలపల్లి అదనపు కలెక్టర్‌కు తీవ్ర హెచ్చరిక.. మొగుళ్లపల్లి తహసీల్దార్ బదిలీకి ఆదేశం
- ఐనవోలు తహసీల్దార్ విక్రమ్ వివరణపై మంత్రి సంతృప్తి

నేటిధాత్రి, మహబూబాబాద్:
ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులు, భూ రీ సర్వే, భూభారతి, హౌసింగ్ తదితర అంశాలపై జిల్లాల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారుల పనితీరుపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా.. మరికొందరి వివరణలపై సంతృప్తి వ్యక్తం చేశారు.



### నెల్లికుదురు, మొగుళ్లపల్లి తహసీల్దార్లపై మండిపాటు

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు తహసీల్దార్ నిర్లక్ష్యంగా సమాధానాలు ఇవ్వడంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి తహసీల్దార్ సునీతపై కూడా రీ సర్వే అంశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెను వెంటనే మొగుళ్లపల్లి మండలం నుంచి బదిలీ చేయాలని ఆదేశించారు. భూపాలపల్లి అదనపు కలెక్టర్ పనితీరుపైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి హెచ్చరించారు.

### ములుగు తహసీల్దార్‌పై తీవ్ర ఆగ్రహం

ములుగు తహసీల్దార్‌పై ఇప్పటికే 20 మంది ఫిర్యాదులు అందాయని, అయినా పనితీరులో మార్పు కనిపించడం లేదంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. "మీపై ఇప్పటికే 20 మంది ఫిర్యాదులు చేశారు" అంటూ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

### ఐనవోలు తహసీల్దార్ వివరణపై సంతోషం

హనుమకొండ జిల్లా ఐనవోలు తహసీల్దార్ విక్రమ్ రీ సర్వే, భూభారతి అంశాలపై మంత్రి అడిగిన ప్రశ్నలకు స్పష్టమైన వివరాలు ఇవ్వడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

### గీసుకొండ తహసీల్దార్ పనితీరుపై సంతృప్తి

గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్‌ను వివిధ అంశాలపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన పనితీరుపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

### పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ల నుంచి కలెక్టర్ల వరకు అధికారులు పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

### రీ సర్వే, భూభారతిపై సమీక్ష

జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న భూ రీ సర్వే పురోగతిపై మంత్రి అధికారులతో కూలంకషంగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, భూభారతి అమలు తీరుపై వివరాలు తెలుసుకున్నారు.

### హౌసింగ్ అంశాలపైనా సమీక్ష

హౌసింగ్ శాఖకు సంబంధించిన అంశాలపైనా మంత్రి సమీక్షించారు. గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతి, లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన

## పారదర్శకంగా పరిశీలన పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్



జగిత్యాల, నేటిధాత్రి:
జగిత్యాల మండలం మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కింద వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి అందిన దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను సంబంధిత స్థలాల్లో పరిశీలించారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలు, స్థల పరిస్థితి, లేఅవుట్‌కు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వాస్తవ పరిస్థితులను పూర్తిగా నమోదు చేసి, అర్హత కలిగిన దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన వివరాలను టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి తదితర అధికారులను అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోంది!



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలోని లక్షలాది మంది విద్యార్థుల ఉన్నత చదువులను, వారి భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులు, విద్యార్థులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో తలసానిని కలిసి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత విద్యకు దూరం కాకూడనే సదుద్దేశంతో నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెచ్చారని.. ఆ తర్వాత కేసీఆర్ హయాంలో కూడా సకాలంలో నిధులు విడుదల చేశారని గుర్తుచేశారు.
కానీ ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ.11,000 కోట్ల బకాయిలను పెండింగ్‌లో పెట్టి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు కోర్సులు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ అండగా ఉంటుందని తలసాని హామీ ఇచ్చారు.
నీట్ పేపర్ లీకేజీపై 'జెన్ జీ' యువత జరిపిన నిరసనలతో కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా దిగొచ్చిందో, అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా విద్యార్థులు గట్టి పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేయాలి : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

జగిత్యాల, నేటిధాత్రి:
ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయం తో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.
మంగళవారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లతతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు, అంతర్ కుల వివాహ ప్రోత్సాహకాలు, పీఎం అజయ్ పథకం, అట్రాసిటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, మున్సిపల్ కార్మికులకు బీమా, 2బీహెచ్‌కే ఇళ్లు, పీఎం విశ్వకర్మ, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, ఎస్సీ, ఎస్టీ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.
ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత సమయంలో ఎలాంటి జాప్యం లేకుండా జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్, కులాంతర వివాహ ప్రోత్సాహక పథకాలకు సంబంధించిన పెండింగ్ నిధులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ఎంత పరిహారం అందించారు, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారు అనే వివరాలతో సమగ్ర నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలు సమర్పించాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా సమర్పించాలని కమిషన్ చైర్మన్ సూచించారు. ఎస్.డీ.ఎఫ్., సీ.డీ.పీ., ఎం.పీ. ల్యాడ్స్ నిధులు మంజూరు చేసే సమయంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గ్రామాలకు అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ ప్రాంతాల అభివృద్ధికి 15 శాతం, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధికి 10 శాతం నిధులు కేటాయించేలా చూడాలని తెలిపారు. కేటాయించిన నిధులతో పనులు సక్రమంగా చేపట్టకపోతే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.2,500 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను సద్వినియోగం చేయాలి

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సుమారు రూ.2,500 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంచి రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ నిధులతో చేపట్టాల్సిన పనులకు అవసరమైన అంచనాలను ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఈఈలు సిద్ధం చేసి సమర్పించాలని, నిధులను సక్రమంగా వినియోగిస్తూ పనులను పూర్తి చేయాలని సూచించారు.

నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరి

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల సమయంలో కూడా రిజర్వేషన్ రోస్టర్‌ను తప్పనిసరిగా పాటించాలని కమిషన్ చైర్మన్ స్పష్టం చేశారు. పదోన్నతుల్లో కూడా రోస్టర్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని మూడు పట్టణ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల్లో పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఉన్నందున వారికి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో రూ.30 లక్షల బీమా కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు కూడా ఎస్.బి. ఐ. బ్యాంక్ ద్వారా బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలే లక్ష్యం

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి అవసరమైన అంచనాలను సిద్ధం చేసి పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.
అంగన్‌వాడీ భవనాల అనంతరం మహిళా భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాలను బి బి జి ఆర్ ఏ ఎం జి కింద, పట్టణ ప్రాంతాల్లో సిడిపి కింద ప్రతిపాదించాలని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం సొంత భవనంలో నిర్వహించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

అట్రాసిటీ కేసుల్లో శిక్షల శాతం పెంచాలి

ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీకి పాల్పడే వారికి చట్టంపై భయం కలిగేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ అన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు, విచారణను సమర్థవంతంగా నిర్వహించి శిక్షల శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఎండిపోతున్న పంటలకు జీవం.. పత్తిపల్లికి దేవాదుల నీటి విడుదల





- మంత్రి సీతక్క చొరవతో 'ఎదల్ల చెరువు'కు చేరిన సాగునీరు
- రైతాంగాన్ని ఆదుకున్న ప్రజా ప్రభుత్వం: సర్పంచ్ సరిత సారయ్య

ములుగు, నేటిధాత్రి :
కరువు పరిస్థితులతో నెర్రలు బారుతున్న పంట పొలాలకు సాగునీరందించి రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ప్రత్యేక చొరవ చూపారు. ములుగు మండలం పత్తిపల్లి పరిసరాల్లో ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయే దశకు చేరుకోగా, రైతుల గోడును విన్న మంత్రి వెంటనే స్పందించారు. దేవాదుల ప్రాజెక్ట్ పైప్‌లైన్ ద్వారా పత్తిపల్లి గ్రామ శివారులోని 'ఎదల్ల చెరువు'లోకి సాగునీటిని మళ్లించి, అక్కడి నుంచి పంట పొలాలకు విడుదల చేయించారు.
మంత్రి సీతక్క ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ సరిత సారయ్య ఆధ్వర్యంలో నీటి విడుదల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మత్స్యశాఖ డైరెక్టర్ కంబాల రవి, మండల అధ్యక్షుడు ముశినేపల్లి కుమార్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అర్షం రఘు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ సరిత సారయ్య మాట్లాడుతూ, రైతుల కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ మంత్రి సీతక్క అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఎండిపోతున్న పంటలకు సకాలంలో దేవాదుల నీటిని విడుదల చేయించి రైతులకు ప్రాణం పోశారని, గ్రామం తరఫున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.
పంట పొలాలకు నీరు చేరడంతో పత్తిపల్లి గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయకట్టు పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని ఖండించిన పాలకుర్తి తిరుపతి



**పరకాల, నేటిధాత్రి:** తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అంటే కేవలం ఒక కార్యాలయం కాదని,తెలంగాణ కోట్లాది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం తెలంగాణ ప్రజల మనోభావాలపై దాడి చేయడమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచకం,దౌర్జన్యం పెరిగిపోయాయని ఆరోపించారు.ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రాజకీయంగా బీజేపీని ఎదుర్కోలేక,ఆ పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కాంగ్రెస్ పిరికిపంద చర్యలకు పాల్పడుతోందని అన్నారు.రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన యూత్ కాంగ్రెస్ నాయకులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి,కఠిన చర్యలు తీసుకోవాలని పాలకుర్తి తిరుపతి డిమాండ్ చేశారు. బీజేపీ కార్యకర్తలు ఇలాంటి బెదిరింపులకు భయపడరని,ఒక్కో కార్యకర్త వెయ్యి మందిగా మారి కాంగ్రెస్ దౌర్జన్యాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో తిప్పికొడతామని ఆయన స్పష్టం చేశారు.

## వెయ్యి రోజులు కాదు వెయ్యేండ్లు గుర్తుండేలా ప్రజాపాలన

▶▶ పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి...



**పరకాల, నేటిధాత్రి:** ప్రజల కోసం పనిచేసే పాలన మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలని,అలాంటి ప్రజాపాలన వెయ్యి రోజులు కాదు వెయ్యేండ్లు గుర్తుండేలా ఉండాలని పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలనపై తన అభిప్రాయాలను వెల్లడించారు. అధికారం కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. హామీలకే పరిమితం కాకుండా వాటిని ఆచరణలో పెట్టడం ద్వారా ప్రజలకు మార్పు కనిపించేలా పాలన సాగాలని పేర్కొన్నారు. ప్రజల కష్టాలు,కన్నీళ్లను తుడిచే భరోసా కల్పించడంతో పాటు ప్రతి కుటుంబం జీవితంలో మెరుగైన మార్పు తీసుకురావడమే నిజమైన ప్రజాపాలన అని అన్నారు. పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటం,ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడం,రాబోయే తరాల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ధ్యేయంగా పెట్టుకుని అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని బొమ్మకంటి చంద్రమౌళి కొనియాడారు. ప్రజల గుండెల్లో నిలిచే విధంగా పాలన అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన అన్నారు.

## నూతన డీఈవోగా లలిత బాధ్యతలు స్వీకరణ

▶▶ జిల్లా కలెక్టర్ బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు...



**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎల్. లలిత మంగళవారం ఐడి ఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపాలని వారు సూచించారు జిల్లాలో ప్రభుత్వ విద్యా రంగం మెరుగుపడేలా కృషి చేస్తానని వారు అన్నారు

## ఉద్యమనేత పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

▶▶ పెద్ది మరణం నెల రోజుల సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ.. చిత్రపటానికి నివాళులు...



**నర్సంపేట, నేటిధాత్రి:** తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజా జీవితంలో చేసిన సేవలు, తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్ర చిరస్మరణీయమని ఉద్యమకారులు కొనియాడారు. ఆయన మృతికి నెల రోజులు పూర్తయిన సందర్భంగా నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారులు గుంటి కిషన్,నాగ రమాదేవి మాట్లాడుతూ 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి కీలకంగా పనిచేశారని, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఆశయాల సాధన కోసం ఆయన నిరంతరం పనిచేశారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది పోషించిన పాత్ర చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ప్రజలే కుటుంబంగా భావించి జీవితాంతం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన ప్రజానాయకుడిగా పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. నర్సంపేట ప్రాంత అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. ఆయన మరణం తెలంగాణ ఉద్యమానికి, నర్సంపేట ప్రాంతానికి తీరని లోటని అన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బైరి తిరుపతిరెడ్డి, అప్పల సుదర్శన్, రాపుల సతీష్, మచ్చిక నర్సయ్య, రామస్వామి ఉపేందర్‌రెడ్డి, , దొంగల సురేష్, మొటారి రవి, తోట సుదర్శన్, దోనాల రవి, షేక్ అన్వర్, మేడిద శ్రీనివాస్, మేడిద రవి, మట్టపల్లి శ్రీనివాస్, వల్లపు శ్రీనివాస్, పేరుమల్ల ప్రభాకర్‌రెడ్డి, దాసరి రమేష్, బుస అశోక్, పెరుమండ్ల రవి, పల్లాటి సాంబయ్య, గండ్రోజు భాస్కర్, నల్ల రవీందర్, వేల్పుల సురేష్, కోరే సుధాకర్, గాదె ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే నం 601/1లో నివాసముంటున్న పేదలకు పట్టాలివ్వాలి

▶▶ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా...



**నర్సంపేట, నేటిధాత్రి:** పేద సంక్షేమమే లక్ష్యమని చెబుతున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పేదల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి, పట్టణ కార్యదర్శి, 10వ వార్డు కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ విమర్శించారు. సర్వే నంబర్ 601/1లో గత ఐదేళ్లుగా నివాసముంటున్న పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. 57 ఏళ్లు నిండిన అర్హులైన వృద్ధులకు పింఛన్లు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఒకే ప్రాంతంలో నివాసముంటూ ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఇప్పటికీ పట్టాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పట్టాలు లేకపోవడంతో పేద కుటుంబాలు తమ ఇళ్ల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నాయని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్ల కోసం వృద్ధులు కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. వయోభారంతో కూలి పనులకు వెళ్లలేని వృద్ధులకు మందులు, వైద్యం, నిత్యావసరాల కోసం పింఛన్ ఎంతో అవసరమని పేర్కొన్నారు. పేదల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పేదల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, ఎన్నే మల్లారెడ్డి, గోనె మల్లారెడ్డి, పెండ్యాల సారయ్య, కమతం వెంకన్న, కలకోట అనిల్, ఎండీ ఫరీదా, వజ్జంతి విజయ, బిట్ర స్వప్న, లక్క రాజు, ఉదయగిరి సరిత, జగన్నాథం కార్తిక్, విలియం కెరీ తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా రెడ్డి సంఘం ఎన్నిక

## రెండవసారి ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఎన్నిక.



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ఆదర్శ రెడ్డి సంఘం ఎన్నికల్లో ఇట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఎన్నికైనారు. ఈ సందర్భంగా. జిల్లెల్ల గ్రామంలో రెడ్డి సంఘం ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లెల్లరెడ్డి సంఘం అధ్యక్షుడిగా రెండవసారి ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి నీ సంఘ సభ్యులందరికీ మద్దతుతో రెండోసారి అధ్యక్షుడిగా ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డిని ఎన్నుకోవడంజరిగింది. నూతనంగా రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికైన ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంఘసభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ సంఘ అభివృద్ధికి. సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని. అలాగే రెడ్డి సంగం అభివృద్ధిలో భాగంగా అందరి సహాయ సహకారాలతో రెడ్డి సంఘం సభ్యులతో మమేకమై అందరితో కలుపుగోలుగా ఉంటూ ఎటువంటి సమస్యలు ఉన్న వాటిని పరిష్కారం చేసే విధంగా అందరితో కలిసి పరిష్కరిస్తామని. ముఖ్యంగా రెడ్డి సంఘ సభ్యులందరినీ రెడ్డిలను ఏకధాటిపై తీసుకువచ్చి సంఘశీ నుఅభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తానని. మళ్లీ రెండోసారి నాకు అధ్యక్ష పదవి కల్పించినందుకు అందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను

## కరాటే పోటీల్లో బ్రిలియంట్ విద్యార్థుల ప్రతిభ



**నస్పూర్, నేటిధాత్రి:** నస్పూర్‌లోని సీతారామ కల్యాణ మండపంలో ఆగస్టు 30న నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవెల్ కరాటే సెలక్షన్ కమ్ ఛాంపియన్‌షిప్--2026 పోటీల్లో బ్రిలియంట్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. టీమ్ కటాస్ విభాగంలో వివిధ గ్రూపుల్లో ప్రథమ స్థానంలో ఎం. శరణ్య,టీ. అవని,కే. ఆరతి,జీ. అయాన్, జేబీ. ఆహేల్,బి. నందిత రావు నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎస్‌కే. సుహాన్,ఓ. సాయి కుమార్,ఆర్. మానవిష్ నిలిచి ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన విద్యార్థులను బ్రిలియంట్ స్కూల్స్ చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, ప్రిన్సిపాల్ బి. స్రవంతి,సీనియర్ కరాటే మాస్టర్ రంగ రమేష్ అభినందించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీ 18 వ వార్డ్ లో సర్ -2 నోటీసుల పంపిణీ..



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** తెలంగాణ సర్–2 ప్రక్రియలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెంబర్ 18లో గల బూత్ నంబర్ 59 లో ఓటర్లకు నోటీసుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎమ్మార్వో సతీష్‌కుమార్, స్థానిక కౌన్సిలర్ పల్లె శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు లు పాల్గొన్నారు. 2002 ఓటర్ల జాబితా ప్రకారం తల్లిదండ్రుల పేర్లు, వయస్సు, ఇంటిపేరు తదితర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు ఎన్నికల సంఘం తరఫున నోటీసులు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసులో సూచించిన విధంగా సంబంధిత ఓటరు, వారి తల్లిదండ్రులకు సంబంధించిన ఆధార పత్రాలను జతచేసి నిర్ణీత గడువులోగా బీఎల్ఓలకు అందజేయాలని ఎమ్మార్వో సతీష్‌కుమార్ సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరుకు నోటీసులు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించి సర్–2 ప్రక్రియకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్, బి ఎల్ ఎ అంతడుపుల నాగరాజు, రాజన్న, ఇబ్రహీం, మహిళా నాయకురాళ్లు పుష్ప, రాజేశ్వరి తదితరులు, ఓటర్లు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదగురాపంగా కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపిన నాయకులు అనంతరం సమస్యలు పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్సీ ఎస్టీ కమిషనర్ బక్కి వెంకటయ్య హామీ ఇచ్చినట్లు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీ ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు.ూవీజ. డైరెక్టర్ బాలు. కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ళభరత్ గౌడ్. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల తిరుపతి. తదితరులు ఉన్నారు.

## కోతుల బెడద తప్పించు కునేది ఎలా!




▶▶ వామ్మో కోతి.... భయాం దోళనలో ప్రజలు...

▶▶ పట్టించుకోని అధికా రులు..

**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండల కేంద్రం లో కోతుల బెడద విపరీతం గా ఉంది. మండల కేంద్రం లో పన్నుల రూపంలో అధి కారులు వసూలు చేస్తున్న మౌలిక వసతుల కల్పన తోపాటు ప్రజల ఇబ్బందు లను తీర్చాల్సిన బాధ్యత పాలకుల అధికారులపై ఉందని ప్రజలు తెలిపారు. కోతుల స్వైరవిహారం ఎక్కు వైన పట్టించుకునే నాధుడే లేదని కోతులు దాడులు చేస్తున్న నియంత్రణ చర్య లు చేపట్టడం లేదని వాడ వాడలోని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు పలు వీధుల్లో కోతులు తిరుగు తున్న వాటిని కట్టడి చేసేం దుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తినుబం డారాలు పాత్రలు ఇంట్లోని వంట సామాగ్రిని వస్తువు లను బట్టలను సైతం కోతు లు ఎత్తుకెళ్తున్నాయని అధికారులు నిమ్మకు నేర్పి నట్లుగా చోద్యం చూస్తు న్నారు కోతుల బెడద తీర్చా ల్సిన బాధ్యత అధికారులు, కోతుల విడదలో ప్రజలు బెంబేలెస్తుతున్నారని చిన్న పిల్లలు వృద్ధులు మహిళలు కోతుల బారినపడి గాయాల పాలవుతున్నారు కోతులు గుంపులు గుంపులుగా వస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతు న్నారు. ఉదయం లేచిన నుండి రాత్రి పడుకునే వరకు కోతులు ఇంట్లోకి వస్తాయని భయంతో బతకాల్సిన పరిస్థితి ఉందని తలుపులు తీస్తే ఇంట్లోకి దూరి ఇంట్లో ఉన్న వస్తువులను పడేస్తూ చిందరవందరంగా చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండల అధికారులు సత్వ రమే స్పందించి కోతుల బెడద నుండి ప్రజలను కాపాడాలి

## కులగణన శాస్త్రీయంగా జరగాలి:బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్

▶▶ ప్రతి కులానికి ప్రత్యేక కోడ్.. ఓబీసీకి స్పష్టమైన గుర్తింపు ఇవ్వాలి...



**నర్సంపేట, నేటిధాత్రి:** 2027లో నిర్వహించనున్న జనగణనలో కులగణనను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని బీసీ ఉద్యమ నాయకుడు, బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. ప్రశ్న నంబర్ 10ను సవరించి ఎస్సీ, ఎస్టీలతోపాటు ఓబీసీ కేటగిరీని స్పష్టంగా చేర్చాలని కోరారు. నర్సంపేటలో వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో 'సెన్సెస్–2027లో బీసీలకు జరగబోయే అన్యాయం'పై డాక్టర్ అశోక్ మాట్లాడారు. ప్రతి కులానికి ప్రత్యేక ప్రామాణిక కోడ్ కేటాయించి, డిజిటల్ జనగణనలో డ్రాప్‌డౌన్ విధానం అమలు చేయాలని సూచించారు. ఓపెన్ ఎండెడ్ విధానంలో కులాల పేర్లు, పర్యాయపదాలు, ప్రాంతీయ పేర్లు భిన్నంగా నమోదైతే డేటాలో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉన్న బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల జాబితాలను సమగ్రంగా రూపొందించి కులగణనకు ముందే ప్రశ్నావళి, కోడింగ్ విధానం, ఎన్యూమరేటర్ల శిక్షణ మార్గదర్శకాలను పునఃపరిశీలించాలని కోరారు. కులగణనలో లోపాలు జరిగితే వాటి ప్రభావం విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యంపై దశాబ్దాలపాటు ఉంటుందని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గుంటి కిషన్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం సాధ్యమన్నారు. కులగణన అంశంపై బీసీ సంఘాలు, నాయకులు విస్తృత అవగాహన కల్పించాలని డాక్టర్ అశోక్ పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రముఖ కవి, రచయిత మండ వీరస్వామి గౌడ్,డాక్టర్ స్ఫూర్తి, పి. సహజ, విద్యాసాగర్, డాక్టర్ శివుడు, వెంకట్‌గౌడ్, కుమార్ రజక, వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రకాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షుడిని కలిసిన



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ తంగళ్ళపల్లి మండలానికి చెందిన సత్తు శ్రీనివాస్ రెడ్డి. హైదరాబాదులోని పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్. గౌడ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా పలు విషయాలపై పిసిసి అధ్యక్షులు దృష్టికి తీసుకు తీసుకువెళ్లారని తెలిపారుపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. ప్రసంశిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున చేపడుతున్న కార్యక్రమాల గురించి చర్చిస్తూపార్టీ బలోపేతం కోసం చేస్తున్న కృషి అభినందనీయమని. అలాగే బాగా పనిచేస్తున్నారు కష్టపడుతున్నారు ఇంకా గట్టిగా కష్టపడాలి అంటూ సంగీతం శ్రీనివాసులు మెచ్చుకుంటూ పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మరింత చురుగ్గా పనిచేయాలని పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగాలని సూచిస్తూ. బాగా కష్టపడుతున్నారు పనిచేస్తున్నారు ఇంకా గట్టిగా కష్టపడాలి అంటూ. జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాసును అభినందిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు అలాగే సత్తు శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులకు సుఖచిస్తూ అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోక్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ పార్టీ అంతర్గత నిర్మాణాన్ని పటిష్టం చేయాలని సూచించిన పిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సాకరి గుట్టపై మైనింగ్ రద్దు చేయాలని గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం



నడికూడ,నేటిధాత్రి: మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న 717 సర్వే నేంబర్ లో సాకరి గుట్ట పై మైనింగ్ రద్దు చేయ్యాలని గ్రామస్థులు అందరు ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. గ్రామసభ అనంతరం గ్రామస్థులు అందరు బస్టాండ్ కూడలిలో సాకరి గుట్ట మైనింగ్ రద్దు చేయ్యాలని ధర్నా నిర్వహించడం జరిగింది. సాకరి గుట్ట మైనింగ్ పై ఎమ్మెల్యే ప్రకాష్ రేడ్డి పై కోంత మంది ఆసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే ని బద్నాం చేయాలి అని కొంత మంది కుట్రలు చేస్తూన్నారు అవి మానుకోవాలని సర్పంచ్ కోంగంటి తిరుపతి తేలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డ్ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ 10 ఏళ్ల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే సమరభేరి డ్రామా

## కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము



**మొగులపల్లి నేటిధాత్రి:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక, ప్రజల్లో తమ ఉనికిని చాటుకోవడం కోసమే బీఆర్ఎస్ పార్టీ సెప్టెంబర్ 2 నుండి సమరభేరి పేరుతో డ్రామాలాడుతోందని కాంగ్రెస్ నాయకులు నడిగోటి రాము తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేస్తున్న ఆరు గ్యారెంటీల విమర్శలు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అప్పులపాలు: 10 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను రూ. 7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిందని, కాళేశ్వరం పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని వృధా చేసిందని కాంగ్రెస్ నాయకులు నడిగోటి రాము ఆరోపించారు. ఆనాడు రైతులకు రుణమాఫీ చేయని వారు, దళిత బంధును ప్రతి నియోజకవర్గంలో 100 మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్న వారు, నేడు కాంగ్రెస్ ను ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతలు: అప్పులతో ఖాళీ అయిన ఖజానాను చక్కదిద్దుకుంటూనే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని ఆయన వివరించారు. మహాలక్ష్మి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నెలకు రూ. 3000 ఆదా అవుతోంది, రూ. 500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. గృహజ్యోతి: 200 యూనిట్ల ఉచిత కరెంటుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఊరట. రైతు భరోసా ఓ రుణమాఫీ: రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతన్నను రుణ విముక్తుడిని చేసిన ఏకైక ప్రభుత్వం మనదే. యువతకు ఉద్యోగాలు: గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఇవ్వని ఉద్యోగాలను, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరలోనే 60 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టింది. మెగా ఖూజా తో 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసింది. ఇందిరమ్మ ఇళ్లు: పేదల సొంతింటి కలను నిజం చేస్తూ రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

▶▶ **సమరభేరి కాదు, ఉనికి కోసం పోరాటం....** సెప్టెంబర్ 2 నుండి బీఆర్ఎస్ చేసే సమరభేరి ప్రజల కోసం కాదని, కేసీఆర్ కుటుంబ పాలనను, వారి అవినీతిని కాపాడుకోవడం కోసమేనని మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము ఎద్దేవా చేశారు. భూపాలపల్లి ప్రజలు గత ఎన్నికల్లోనే బీఆర్ఎస్ కు తగిన గుణపాఠం చెప్పారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు.

## తహశీల్దార్ కార్యాలయం ముందు ఉద్యోగ సంఘాల ధర్నా



▶▶ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి....

**భూపాలపల్లి, నేటిధాత్రి:** ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి పిలుపు మేరకు సెప్టెంబర్ 1వ తేదీని "సీపీఎస్ విద్రోహ దినం"గా పాటిస్తూ, సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా తహశీల్దార్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన విరామ సమయంలో తహశీల్దార్ రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్ ఎస్ ఏ భూపాలపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు అంజలిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడుతూ, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రస్తుత ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యోగులందరిలో ఎలాంటి అసమానతలు లేకుండా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జిల్లా ఉద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో జిపిఓల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బండి శ్రీనివాస్, జిల్లా జిపిఓల సంఘం అధ్యక్షుడు బందెల జితేందర్, ప్రధాన కార్యదర్శి ఇనిగాల కృష్ణమూర్తి, మండల జిపిఓల సంఘం అధ్యక్షుడు కుర్రె కుమార్, ఆర్డీవో తహశీల్దార్ కార్యాలయాల సిబ్బంది, జిపిఓలు వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బెడద నుండి ప్రజలను కాపాడండి



**శాయంపేట, నేటిధాత్రి:** కోతుల బెడద నుండి మండల కేంద్రంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవు తున్నారని కావున వాటి బెడద నుండి ప్రజలను కాపాడాలని కందగట్ల సంతోష్ అన్నారు. కోతుల దాడిలో మహిళలు వృద్ధులు, చిన్న పిల్లలు గాయాల పాలవుతున్నారు గత రెండు సంవత్సరాల నుండి గ్రామపంచాయతీకి పాలకవర్గాలు లేక నిధులు విడుదల చేయలేకపో వడంలో ఎక్కడ పనులు అక్కడే ఉండడం జరిగింది నూతనంగా ఎన్నికైన పాలకవర్గం సర్పంచ్ ప్రజలకు హామీలు అమలు చేయాలని ప్రజలు కోరుతు న్నారు గ్రామపంచాయతీ వేధిస్తున్న కోతుల బెడదను తప్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు కోతుల నుండి ప్రజలను కాపాడాలని అవి చేసే దాడుల్లో మండల కేంద్రం లోని ప్రజలు తీవ్ర గాయాలై ఇబ్బందులు పడుతున్నారు గత రెండు మూడు రోజుల క్రితం మహిళలను చిన్నపి ల్లలపై దాడి చేసిన గ్రామపం చాయతీ అధికారులకు చల నంలేదని తక్షణమే అధికా రులు స్పందించి వాటి నివారణ కోసం చర్యలు తీసుకొని ప్రజలను కాపా డాలని ప్రజలు అధికా రులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తాం



**పరకాల, నేటిధాత్రి:** ఓటు బ్యాంకు రాజకీయాలతో కాంగ్రెస్, శ్రీబీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా విస్మరిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు,మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు విమర్శించారు.బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు.మంగళవారం పరకాలలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ధర్మారావు మాట్లాడారు.సెప్టెంబర్ 2న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు కాజీపేట నుంచి ర్యాలీగా పరకాలకు చేరుకుని అమరవీరులకు నివాళులర్పించనున్నారని తెలిపారు.ప్రజలు,అమరవీరుల కుటుంబ సభ్యులు,బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పరకాల ప్రాంతంలో జరిగిన తెలంగాణ విమోచన పోరాటంలో పలువురు ప్రాణత్యాగం చేశారని,అమరధామం నాటి పోరాట చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోందని ధర్మారావు పేర్కొన్నారు.డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్‌రావు మాట్లాడుతూ తెలంగాణ విమోచన పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంలో కాంగ్రెస్,బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు.బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్పీ జయంత్‌లాల్,దేవునూరి మేఘనాథ్,పరకాల కౌన్సిలర్ కుక్కల విజయ్‌కుమార్,బెజ్జంకి పూర్ణచారి,కచం గురుప్రసాద్,గుజ్జ సత్యనారాయణ,పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శులు సంగా పురుషోత్తం,పాలకుర్తి తిరుపతి,ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్,బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పున్నం వేణు,దంచనాల కిరణ్,జిల్లా నాయకులు దగ్గు విజేందర్‌రావు,మార్తా రాజభద్రయ్య,కోలనుపాక భద్రయ్య,బాసాని సాంబరాజు,ఓబీసీ అధ్యక్షుడు పైండ్ల రంజిత్,మెంతుల సురేష్,చెందు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండు పార్కింగ్ ఫీజుపై అపోహలు వద్దు

▸▸ వరంగల్ - 1 డిపో మేనేజర్ పుప్పాల అర్పిత...

▸▸ ఆర్టీసీ నిర్ణయించిన రుసుములే వసూలు చేస్తున్నాం...



**హనుమకొండ, నేటిధాత్రి:** హనుమకొండ బస్టేషన్లో ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారంటూ మీడియాలో వచ్చిన వార్తలపై వరంగల్-1 డిపో మేనేజర్ పుప్పాల అర్పిత వివరణ ఇచ్చారు. టెండర్ నిబంధనలు, ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించిన రేట్ల ప్రకారమే పార్కింగ్ రుసుములు వసూలు చేస్తున్నట్లు తెలిపారు.ద్విచక్ర వాహనాలకు 4 గంటల వరకు రూ.20, 4 గంటలు దాటి 24 గంటల వరకు రూ.30గా రుసుము నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నిర్ణయించిన రుసుముల వివరాలను పార్కింగ్ స్థలంలో ప్రయాణికులకు కనిపించేలా ప్రదర్శించినట్లు తెలిపారు. నిర్ణయించిన రుసుము కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. పార్కింగ్ కాంట్రాక్టర్ అధిక రుసుములు వసూలు చేయకుండా కఠినంగా ఆదేశించామని, బస్టేషన్లో విధులు నిర్వహించే కంట్రోలర్లు, సూపర్‌వైజర్లతో నిరంతరం తనిఖీలు చేయిస్తున్నామని తెలిపారు.ఎవరైనా అధిక పార్కింగ్ ఫీజు వసూలు చేసినట్లయితే వాహన నంబరు, రశీదుతో ఎస్ఎం/హనుమకొండ 99592 26056 లేదా డ్యూటీ కంట్రోలర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులు ఎలాంటి అపోహలకు గురికావద్దని డిపో మేనేజర్ పుప్పాల అర్పిత కోరారు.

## గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్ రిమాండ్ కు తరలింపు.



**కల్వకుర్తి, నేటిధాత్రి:** నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో గంజాయిని అమ్ముతున్న రంగాపూర్ గ్రామానికి చెందిన ఆలే సత్యనారాయణ అలియాస్ సత్తి అనే యువకుడిని అరెస్ట్ చేసి మంగళవారం నాడు రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు...ఇతను గత మూడు సంవత్సరాలుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా ప్రాంతం నుంచి లకన్ అలియాస్ లాలా, సునీత అనే వ్యక్తుల నుంచి కిలోల రూపంలో గంజాయిని కొనుగోలు చేస్తూ అట్టి గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసి అట్టి ప్యాకెట్లను నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో, జిల్లా చుట్టుపక్కల ప్రాంతాలలోని యువకులకు ఒక్కో ప్యాకెట్టు 300 నుంచి 400 రూపాయలకు అమ్మటం డబ్బులు సంపాదిస్తు యువతను గంజాయికి బానిసలుగా మారుస్తున్నాడు... ఈ సందర్భంగా యువతకు పోలీస్ వారి హెచ్చరిక... ఎవరైనా గంజాయిని కొనుగోలు చేసిన సేవించిన అమ్మిన అట్టి వ్యక్తులపైన కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయి. అదేవిధంగా ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి గంజాయిని సంబంధించి ఎలాంటి సమాచారం మీ దగ్గర ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

## పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి.



**చిట్యాల, నేటిధాత్రి:** భూపాల్ పల్లి జిల్లా చిట్యాల మండలం లో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దారు కి రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిసీఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకుడు రత్న రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు రూ. 14,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నది. ఈ ఫీజులు చెల్లించలేని దుస్థితి కారణంగా ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కళాశాలల్లో తమ చదువులను కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బకాయిలు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగి మధ్యలోనే ఆగిపోతున్నాయి. కొందరు విద్యార్థులు ఆత్మ హత్యలు చేసుకుంటున్నారు. మొత్తంగా ఈ ప్రభావం ఒక కోటి కుటుంబాలపై పడింది. ఇంతటి దుర్భర పరిస్థితిని బీసీ ఎస్సి ఎస్టీపేద విద్యార్థులు ఎదుర్కొంటున్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఈ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, విద్యార్థులు ఎటువంటి ఆటంకం లేకుండా తమ విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాము. అదేవిధంగా అర్జెంటుగా ప్రభుత్వం కళాశాలలో చెల్లించే ఫీజుల తో నిమిత్తం లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీ యాజమాన్యం ఆపకుండా వెంటనే ఇచ్చేలా ఒక జి ఓ ని విడుదల చేయాలి కోరాడు. ఈ కార్యక్రమంలో పాల్గొని బిసి ఎస్సి ఎస్టిడ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మండల ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రమేష్ , చిలుముల శశి కుమార్, చిలుముల కృష్ణ, చిలుముల శ్యామ్ నయన్, బొడ్డు పాల్ చరణ్ సాదా రాజేష్ ఇరవేణి రాజు మోతుకూరు రవి అచ్చి పాల్గొన్నారు.

## ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొలగాని శ్రీనివాస్

▸▸ నూతన కమిటీకి పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ అభినందనలు...



**పరకాల, నేటిధాత్రి:** ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పరకాల ఎక్సైజ్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు.ఎన్నికల్లో ఆయనకు సహ ఉద్యోగుల నుంచి విశేష మద్దతు లభించింది.తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న తోటి ఉద్యోగులకు కొలగాని శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనపై సహ ఉద్యోగులు ఉంచిన విశ్వాసాన్ని ఎల్లప్పుడూ గౌరవిస్తూ,వారి సంక్షేమం,సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.ఉద్యోగులందరినీ సమన్వయం చేసుకుంటూ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వేల్పుకుంట కొమురయ్య, కోశాధికారిగా బి.నరేష్ ఎన్నికయ్యారు.ఇతర కార్యవర్గ సభ్యులుగా పి.రవి ప్రసాద్,ఖాత విరమణయ్య,సరస్వతి,వంశీకృష్ణ,స్వరూప రాణి,ఎం.డి.నిరోధిన్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొలగాని శ్రీనివాస్ నూతన కార్యవర్గ సభ్యులతో కలిసి పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీని మర్యాదపూర్వకంగా కలిశారు.సీఐ తాతాజీని శాలువాతో సత్కరించి,పుష్పగుచ్ఛం అందజేశారు.అనంతరం సీఐ తాతాజీ నూతన అధ్యక్షుడు కొలగాని శ్రీనివాస్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.అసోసియేషన్ నూతన కార్యవర్గం ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సమష్టిగా పనిచేయాలని సీఐ తాతాజీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు,సహ ఉద్యోగులు పాల్గొన్నారు.తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న సహ ఉద్యోగుల నమ్మకమే తనకు మరింత బాధ్యతను పెంచిందని కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు.వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ,ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అక్రమ కేసును తక్షణమే ఎత్తివేయాలి - కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు క్యాతరాజు రమేష్ డిమాండ్



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత ఎంపీ రాహుల్ గాంధీపై అక్రమంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను తక్షణమే తొలగించాలని మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు క్యాతరాజు రమేష్ డిమాండ్ చేశారు.ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గారి సభ అనంతరం బీజేపీ నేతలు నిర్వహించిన శుద్ధి యజ్ఞాన్ని రాహుల్ గాంధీ గారు దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యగా ఖండిస్తూ, దళితుల హక్కుల కోసం గళం వినిపించారు. దళితుల పక్షాన నిలబడినందుకే రాహుల్ గాంధీపై కక్షపూరితంగా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్యంలో దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దళితులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీ గారి గొంతు నొక్కేందుకే ఇలాంటి అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇలాంటి కుట్రలకు భయపడబోమని క్యాతరాజు రమేష్ స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే ఈ అక్రమ ఎఫ్ఐఆర్ ను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే రేవూరి జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ



**పరకాల, నేటిధాత్రి:** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కౌన్సిలర్ అల్లె దశరథం ఆధ్వర్యంలో పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్ కుమార్తో పాటు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ అల్లె దశరథం మాట్లాడుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నాయకత్వంలో పరకాల అభివృద్ధికి కృషి చేస్తామని,ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## బీజేపీ కార్యాలయాలపై కాంగ్రెస్ దాడులు అమానుషం

▸▸ జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన...



**భూపాలపల్లి, నేటి ధాత్రి:** నాంపల్లిలోని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిని నిరసిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నిషీధర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలు, రైతుల సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటాలు, ధర్నాలు చేస్తోందని అన్నారు. ప్రజల తరపున ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలపై, పార్టీ కార్యాలయాలపై, ఇళ్లపై కాంగ్రెస్ గూండాలు దాడులకు పాల్పడటం అత్యంత అమానుషమని తీవ్రంగా మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి పాపన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాద్ రావు ఎరుకల గణపతి జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్ తాడికొండ రవికిరణ్ పెండ్యాల రాజు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఉడత నాగరాజు అర్బన్ అధ్యక్షులు గీస సంపత్ తదితరులు పాల్గొన్నారు

## అనూహ్యంగా పెరిగిన అడ్మిషన్లు: డీఐఈఓ

ప్రభుత్వ కళాశాల నెక్కొండలో షూ,బ్యాగుల పంపిణీ




**నెక్కొండ, నేటిధాత్రి:** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మీషన్లు పెరిగినవని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. సోమవారం నాడు నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షూ,బ్యాగుల పంపిణీలో పాల్గొని విద్యార్థులకు, అధ్యాపకులకు దిశానిర్దేశం చేసారు. ఇంటర్మీడియేట్ విద్యార్థులకు ఇటీవల పంపిణీ ఐన షూ, బ్యాగులతో విద్యార్థులకు అనూహ్యమైన సౌలభ్యాలు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయని అందులో గత సం. 1192 ఉండగా ఈ రోజు నాటికి 1210 దాటినవని అన్నారు. నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత సం.తో పోలిస్తే రెట్టింపు అడ్మీషన్లు కావడం శుభపరిణామం అని అన్నారు. జిల్లాలోని మొత్తం 2704 విద్యార్థుల్లో 1562 మంది బాలురు, 1142 మంది బాలికలు ఉన్నారని వారందరికీ త్వరలో యూనిఫాం కూడా అందుబాటులోకి రానున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కరుణశ్రీ, గ్రామ విద్యాభిలాషులు పవన్ గ్రంథపాలకుడు అశోక్, అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ పై ఎఫ్ఐఆర్ ను వెంటనే తొలగించాలి



**భూపాలపల్లి, నేటిధాత్రి:** రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై అక్రమంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను వెంటనే వెనక్కి తీసుకోవాలని భూపాలపల్లి యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ముట్టడికి యత్నించడం జరిగింది అనంతరం పోలీసులు వారిని అరెస్ట్ చేయడం జరిగింది కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడమే బిజెపి ప్రభుత్వం పనిగా పెట్టుకోవడం సిగ్గుచేటు అని వారు అన్నారుఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నమునూరి రజినీకాంత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక సాయి చరణ్ మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్ కొలుగూరి అనిల్ నీలా రాజు పున్నం ప్రవీణ్ కాట్రేవుల నవీన్ కీర్తి రాజు మేకల శివ కట్ల మహేష్ చిరంజీవి బోయిని తిరుపతి ముద్దమల్ల నరేష్ కొంరాజు భాస్కర్ పేరాల రాజేందర్ వెన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ఎమ్మార్వో కు వినతిపత్రం అందజేసిన ధర్మ సమాజ్ పార్టీ...



**పరకాల, నేటిధాత్రి:** రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన సుమారు 14వేలకోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ పరకాల మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పరకాల ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ బొచ్చు నాగరాజు మాట్లాడుతూ సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉండటంతో బీసీ,ఎస్సీ,ఎస్టీ,నిరుపేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఫీజుల బకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాలలు నిలుపుదల చేయకుండా తక్షణమే ప్రత్యేక జీవో జారీ చేయాలని కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థులు,ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు బొచ్చు నాగరాజు,పొనగంటి శ్రీకాంత్,నాగేంద్ర బాలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో 23 అగ్రిమెంట్ల ఏఐటీయూసీ పోరాట ఫలితమే

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కుమార్



**భూపాలపల్లి, నేటిధాత్రి:** సింగరేణి కార్మికుల 23 కీలక అగ్రిమెంట్లు సాధన ఏఐటీయూసీ గుర్తింపు సంఘం పోరాట ఫలితమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. మంగళవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6లో ఘనంగా గేట్ మీటింగ్ నిర్వహించారు. కెటికె-6 పిట్ సెక్రటరీ పి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. సాధించిన 23 అగ్రిమెంట్ల సాధనలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించింది ఇది కార్మికుల విజయమని అన్నారు. ముఖ్యంగా పెర్క్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు,కార్మికుని సహజ మరణానికి రూ. 20 లక్షల పరిహారంపరిమితి లేని వైద్య సదుపాయం అందించాలని యాజమాన్యానికి వివరించడం జరిగిందన్నారు. ఈ గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ భూపాలపల్లి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జి. సుధాకర్ రెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ ఇంచార్జ్ చంద్రమౌళి, గణేష్, ఏఐటీయూసీ నాయకులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ

కాన్కూర్ యూపీఎస్‌లో సర్పంచ్ సాగరిక వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం



**జైపూర్, నేటిధాత్రి:** జైపూర్ మండలం కాన్కూర్ గ్రామంలోని యూపీఎస్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ సాగరిక వెంకటేశ్వర్ గౌడ్, ఉపసర్పంచ్ నేండుగురి పూర్ణచేందర్తో పాటు వార్డు సభ్యులు పాల్గొని విద్యార్థులకు దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించడంతో పాటు, పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు దుస్తులు అందజేయడంతో వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య కార్మికులను విధులకు అనర్హులుగా ప్రకటించాలి

నల్ల బ్యాడ్జీలతో టీజీబీకేఎస్ కార్మికుల నిరసన...



**శ్రీరాంపూర్, నేటిధాత్రి:** అనారోగ్య కార్మికులను విధులకు అనర్హులుగా ప్రకటించాలి.గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల మూడు వైద్య బోర్డులు నిర్వహించి,అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులను వైద్య పరీక్షల అనంతరం విధులకు అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ టీజీబీకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.టీజీబీకేఎస్ సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే-1ఏ,ఐకేఓసీతో పాటు అన్ని గనులు, విభాగాల్లో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం ఆయా గనుల మేనేజర్లకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా టీజీబీకేఎస్ నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగి అనారోగ్య కారణాలతో వైద్య బోర్డుకు దరఖాస్తు చేసుకున్నప్పుడు,అతని ఆరోగ్య పరిస్థితిని పూర్తిస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం విధులకు అనర్హుడిగా ప్రకటించాలని కోరారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సంబంధిత కార్మిక సంఘాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీజీబీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యనిర్వహణ కార్యదర్శి అన్వేష్ రెడ్డి,ఏరియా కార్యదర్శి గొర్ల సంతోష్,గని ఫిట్ కార్యదర్శి గడ్డం మల్లన్న,ఐకేఓసీ ఫిట్ కార్యదర్శి దార్ని దేవేందర్, నాయకులు రామారావు, తుమ్మల రాజిరెడ్డి, ఆకుల సతీష్,సర్వన్,మహేందర్, రాజేందర్,మనోహర్,కిషన్, సమ్మయ్య,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కిషోర్ కుమార్




**వరంగల్, నేటిధాత్రి:** వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన ఎల్. కిషోర్ కుమార్ మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో రెవెన్యూ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.జిల్లా పరిపాలనలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

# ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేయాలి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

▶▶ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి....

▶▶ఎస్సీ, ఎస్టీ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య...

▶▶ఎస్సీ ప్రాంతాలకు 15 శాతం, ఎస్టీ ప్రాంతాలకు 10 శాతం నిధుల కేటాయింపు...

▶▶అట్రాసిటీ బాధితులకు సత్వర పరిహారం, ఉద్యోగాలు అందేలా చర్యలు...

▶▶ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో శిక్షల శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలి...

▶▶అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత...



జగిత్యాల, నేటిధాత్రి:ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయం తో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.మంగళవారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లతతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు, అంతర్ కుల వివాహ ప్రోత్సాహకాలు, పీఎం అజయ్ పథకం, అట్రాసిటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, మున్సిపల్ కార్మికులకు బీమా, 2బీహెచ్‌కే ఇళ్లు, పీఎం విశ్వకర్మ, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, ఎస్సీ, ఎస్టీ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత సమయంలో ఎలాంటి జాప్యం లేకుండా జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్, కులాంతర వివాహ ప్రోత్సాహక పథకాలకు సంబంధించిన పెండింగ్ నిధులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ఎంత పరిహారం అందించారు, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారు అనే వివరాలతో సమగ్ర నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలు సమర్పించాలిఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా సమర్పించాలని కమిషన్ చైర్మన్ సూచించారు. ఎస్.డీ.ఎఫ్., సీ.డీ.పీ., ఎం.పీ. ల్యాడ్స్ నిధులు మంజూరు చేసే సమయంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గ్రామాలకు అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ ప్రాంతాల అభివృద్ధికి 15 శాతం, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధికి 10 శాతం నిధులు కేటాయించేలా చూడాలని తెలిపారు. కేటాయించిన నిధులతో పనులు సక్రమంగా చేపట్టకపోతే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



▶▶**రూ. 2,500 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను సద్వినియోగం చేయాలి....** ప్రస్తుతం అందుబాటులో ఉన్న సుమారు రూ. 2,500 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంచి రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ నిధులతో చేపట్టాల్సిన పనులకు అవసరమైన అంచనాలను ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఈఈలు సిద్ధం చేసి సమర్పించాలని, నిధులను సక్రమంగా వినియోగిస్తూ పనులను పూర్తి చేయాలని సూచించారు.



▶▶**నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరి...** ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల సమయంలో కూడా రిజర్వేషన్ రోస్టర్‌ను తప్పనిసరిగా పాటించాలని కమిషన్ చైర్మన్ స్పష్టం చేశారు. పదోన్నతుల్లో కూడా రోస్టర్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని మూడు పట్టణ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల్లో పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఉన్నందున వారికి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో రూ.30 లక్షల బీమా కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు కూడా ఎస్.బీ. ఐ. బ్యాంక్ ద్వారా బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు.

▶▶**అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలే లక్ష్యం....** అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి అవసరమైన అంచనాలను సిద్ధం చేసి పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ భవనాల అనంతరం మహిళా భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాలను బి బి జి ఆర్ ఏ ఎం జి కింద, పట్టణ ప్రాంతాల్లో సిడిపి కింద ప్రతిపాదించాలని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం సొంత భవనంలో నిర్వహించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

▶▶**అట్రాసిటీ కేసుల్లో శిక్షల శాతం పెంచాలి....** ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీకి పాల్పడే వారికి చట్టంపై భయం కలిగేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ అన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు, విచారణను సమర్థవంతంగా నిర్వహించి శిక్షల శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, తహసీల్దార్లు, ఎస్ఐలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా కేంద్ర ప్రదేశాల్లో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలను రెవెన్యూ శాఖ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు.



▶▶**అట్రాసిటీ బాధితులకు 2బీహెచ్‌కే ఇళ్లు....** ఎస్సీ, ఎస్టీ హత్య, అత్యాచార కేసుల్లో బాధిత కుటుంబాలకు 2బీహెచ్‌కే ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ సూచించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఈ విధానం అమలు చేస్తున్నామని, దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో ఈ తరహా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

▶▶**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లత మాట్లాడుతూ** జిల్లాలో 85 కులాంతర వివాహ ప్రోత్సాహక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించి సుమారు రూ. 2.42 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితుల్లో ఐదుగురికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. వారం రోజుల క్రితం 185 మంది బాధితులకు రూ. 1.06 కోట్లకు పైగా పరిహారం విడుదలైందని, ఆ మొత్తం వెంటనే వారి ఖాతాల్లో జమ కానుందని తెలిపారు. మరో 91 మంది బాధితులకు రూ. 69.45 లక్షల పరిహారం పెండింగ్‌లో ఉందని, ఉన్నతాధికారుల సమాచారం మేరకు వారంలోగా విడుదల కానుందని వివరించారు. పీఎం అజయ్ పథకం కింద 144 యూనిట్లు గ్రౌండింగ్ కాగా, మరో 30 యూనిట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద 317 యూనిట్ల లక్ష్యానికి గాను 219 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వివరించారు. గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జగిత్యాల జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచినట్లు అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ చేతన్ నితిన్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 973 ఎస్సీ, 138 ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో 870 కేసుల్లో ట్రూ ఎఫ్ఐఆర్ ఫైనలైజ్ కాగా, 787 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు వివరించారు. 295 కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదలైనట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు ప్రాధాన్యతతో తీసుకొని, పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజ గౌడ్, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మి నారాయణ, ప్రవీణ్, ఆర్డీవోలు, డిఎస్పీలు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్, సంబంధిత అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్ లు, ఎంపిడివోలు, తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూములను సమగ్రంగా పరిశీలించాలి జిల్లా కలెక్టర్



**భూపాలపల్లి, నేటిధాత్రి:** సెక్షన్ 22ఏ పరిధిలోని భూములకు సంబంధించి మండల, గ్రామాల వారీగా సమగ్రంగా పరిశీలించి వాస్తవమైన, ఖచ్చితమైన డేటాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో భూములు రీ సర్వే, భూ భారతి, సాదా బైనామా, రెవెన్యూ సదస్సు దరఖాస్తులు పరిష్కారంపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను సెక్టార్, గ్రామాల వారీగా ప్రొఫార్మాలో సిద్ధం చేయాలని సూచించారు. డిసెంబర్ 2025 నాటికి సెక్షన్ 22ఏ కింద ఉన్న 1ఏ, 1బీ, 1సీ, 1డీ తదితర కేటగిరీల భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, 2016, 2021 సంవత్సరాల్లో సిద్ధం చేసిన డేటాతో సరిపోల్చాలని తెలిపారు. మండల, గ్రామాల వారీగా భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉన్నట్లయితే వాటికి గల కారణాలను గుర్తించి, అవసరమైన సవరణలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న పాత డేటాను సేకరించి, ప్రస్తుత వివరాలతో పోల్చి పూర్తి స్థాయి నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. ఫారెస్ట్ భూములు, సాగునీటి ప్రాజెక్టులు, సింగరేణి భూములకు సంబంధించి భూముల వాస్తవ స్వభావాన్ని పరిశీలించాలని, ల్యాండ్ అక్విజిషన్ యాక్ట్, అవార్డుల వివరాలను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ, వ్యవసాయేతర కేటగిరీలను నిబంధనల ప్రకారం నిర్ధారించాలని సూచించారు. రీ-సర్వే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ-సర్వేకు సంబంధించిన శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు, జీపీఓలను సమన్వయం చేసుకుంటూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలని తెలిపారు. భూ సర్వే పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి వారం భూ సర్వే పనులపై సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 30వ తేదీ నాటికి భూములకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌పై పూర్తి వివరాలతో కూడిన నివేదికలను ప్రతి మండల తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని ఆదేశించారు. భూ రికార్డుల సవరణలు, 22ఏ భూముల పరిశీలన, రీ-సర్వే, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వర్గీకరణ తదితర అంశాలను సమన్వయంతో పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి జీఎంకు వినతిపత్రం ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు



**భూపాలపల్లి, నేటిధాత్రి:** మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ వార్డులు, సింగరేణి ఓపెన్ కాస్ట్ ఓసీ మైనింగ్. ప్రభావిత పట్టణ-గ్రామీణ ప్రాంతాలు దత్తత గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు టిబిజికెఎస్ ప్రతినిధులు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జీఎం ఎ. రాజేశ్వర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మైనింగ్ కార్యకలాపాల వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా నిరంతరం నీటిని చిలకరించాలని (వాటర్ స్ప్రింక్లింగ్), పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున చెట్లు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. ముఖ్యంగా ఓసి-3 ప్రభావిత ప్రాంతాలు, మైనింగ్ ఎఫెక్టెడ్ వార్డులు, దత్తత గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన కల్పించాలని స్పష్టం చేశారు. ఈ విజ్ఞప్తులపై జీఎం రాజేశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, మైనింగ్ ప్రభావిత పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వాయు కాలుష్య నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని, చెట్ల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు టిబిజికెఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో ఆధునిక సాగు మెళకువలపై ప్రత్యేక శిక్షణ



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైతు విజ్ఞాన కేంద్రాల సమన్వయకర్త డాక్టర్ కె. మదన్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు తరతరాలుగా ఉన్న అనుభవంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం, నాణ్యమైన విత్తనాల ఎంపిక, పురుగులు తెగుళ్లను ముందుగానే గుర్తించడం, ప్రకృతి సేద్యం, వాతావరణాన్ని తట్టుకునే పంటల సాగుపై రైతులకు వివరించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ విస్తరణ పథకం ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తున్నామని, ప్రస్తుతం ప్రత్తిలో ఆకుమచ్చ తెగులు, రసం పీల్చే పురుగులు, వరిలో వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, చిట్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.డి. రఫీ, వ్యవసాయ విస్తరణ అధికారులు మాళవిక, శ్రీకాంత్, అభినయ్, పలువురు ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

# అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి



▶▶వరంగల్ ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం....

**వరంగల్, నేటిధాత్రి:** భారత్--అమెరికా మధ్య కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల నాయకులు వరంగల్ ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం అందజేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు వినతిపత్రం అందజేసిన రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కార్మికులు, పారిశ్రామిక కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టి కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు అనుకూలంగా విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్య కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను సబ్సిడీపై అందించాలని కోరారు. అలాగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ. 31 వేలు ప్రకటించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ, నూతన విత్తన బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భూసేకరణను అడ్డుకోవడంతో పాటు ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించి వ్యవసాయ కూలీలకు 200 రోజుల పని కల్పించాలని, 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జక్కుల తిరుపతి, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, అఖిల భారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు సుధమల్ల భాస్కర్, ఏఐకేకేఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లందాస్ కుమార్, ఏఐకేఎఫ్ జిల్లా నాయకుడు ఐత నగేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బండి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక పనులను త్వరితగతిన గుర్తించాలి

▶▶రైతు పొలాల్లో బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్లు నిర్మించాలి..

▶▶ప్రతి ఇంటికి రూఫ్ టాప్ స్ట్రక్చర్ ఏర్పాటు చేయాలి...

▶▶లేబర్ బడ్జెట్ ప్రకారం 318 పనులను గుర్తింపునకు ఆదేశం...

▶▶కోదాడ క్లస్టర్ పరిధిలో అధికారుల సమీక్ష....



**కోదాడ, నేటి ధాత్రి:** గ్రామాల్లో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక (విజిపిపి) లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల గుర్తింపు పై మంగళవారం కోదాడ క్లస్టర్ పరిధిలోని తొగర్రాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జెడ్పి సీఈవో) శిరీష ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రణాళికా బద్ధంగా పనులను గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఈఓ సూచించారు. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి రైతు పొలంలోనూ బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ బావుల పునరుజీవన నిర్మాణాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వర్షపు నీటిని నిధులుగా మార్చేందుకు ప్రతి ఇంటికి ఒక రూట్ ఆఫ్ స్ట్రక్చర్ ఇంటిపై కప్పు నీటి సంరక్షణ నిర్మాణాలు వంటి పనులను తక్షణమే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ చట్టం కింద లేబర్ బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా క్లస్టర్ పరిధిలో మొత్తం 318 పనులను గుర్తించాల్సి ఉందన్నారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తిచేసి ప్రణాళికలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపిడిఓ ఇస్సాక్ హుస్సేన్, గ్రామ కార్యదర్శి నరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ లిక్కి గురువమ్మ వెంకటయ్య, ఏపీవో, ఈసీ, పిఎస్, తదితరులు అధికారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ సమరభేరి పై ఎస్పీకి వినతిపత్రం మాజీ ఎమ్మెల్యే గండ్ర



**భూపాలపల్లి , నేటిధాత్రి:** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల దగా పాలనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న సమరభేరి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి జిల్లా ఎస్పీ కి వినతిపత్రం అందించారు. ఈ నెల 2 నుండి 8వరకు భూపాలపల్లి నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు 420 హామీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలు శాంతియుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సహకారం అందించాలని ఎస్పీ ని కోరారు. పట్టణ అధ్యక్షుడు జనార్ధన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హరీష్ రెడ్డి సిద్దు పాల్గొన్నారు

# సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జన్మదిన వేడుకలు

▶▶కేక్ కటింగ్,మహా అన్నదానం ఘనంగా జన్మదిన వేడుకలు...



**పరకాల, నేటిధాత్రి:** పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ఘనంగా నిర్వహించారు. పరకాల పట్టణ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పాత మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరకాల పట్టణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్,కౌన్సిలర్లు కొయ్యడ శ్రీనివాస్,బండి శ్రీధర్,సుదమల్ల రమేష్,అల్లె దశరథం,గూడెల్లి సదన్న,నల్లెల్ల కుమార్,పాలకుర్తి శ్రీనివాస్,బొచ్చు మాధవిలత,పసుల రమేష్,బొచ్చు సాల్మన్,గొడుగు నాగరాజు,జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి. జాఫర్ రిజ్వి,పాడి కల్పనా దేవి,కొక్కిరాల స్వాతి,పసుల విజయ,సమన్వయ కమిటీ సభ్యులు ఎం.డి. రంజాన్, చందుపట్ల రాఘవరెడ్డి, మడికొండ సంపత్,పంచగిరి జయమ్మ, లక్కం వసంతతో పాటు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

▶▶**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం....** ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పరకాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో యువకులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ప్రజాసేవలో మరెన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి,మండల అధ్యక్షులు కోలేపాక చందు, మాజీ మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి ఇతర మండలాల అధ్యక్ష కార్యదర్శులు,మైనారిటీ నాయకులు,యూత్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# "ఆర్ అండ్ బి రోడ్ల పక్కన ఊర్ల పేర్ల బోర్డులు ఎక్కడ?.. అధికారుల నిర్లక్ష్యంపై ప్రయాణికుల ఆగ్రహం"

## కొండగట్టు పైకి, జగిత్యాల్ వెళ్లే దారి తెలియక ప్రయాణికుల ఇబ్బందులు...



**కొడిమ్యాల, నేటిధాత్రి:** జగిత్యాల జిల్లా లోని రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బి) పరిధిలోని రహదారులపై ప్రయాణం చేసే ప్రయాణికులకు దారి తెలియక అవస్థలు తప్పడం లేదు. సూచిక బోర్లు ఉన్నచోట తీగలు, చెట్లు, గడ్డి, కప్పి ఊర్ల పేర్లు కనబడకుండా ఉన్నాయి. వాహనదారులు బోర్లు కనబడక ముందుకు వెళ్లి ఎవరినైనా అడిగి వెనుకకి అదే దారిన రావాల్సిన పరిస్థితి నెలకొంది అని వాహనదారులలు తెలుపుతున్నారు. అనే ఇటీవల వచ్చిన నేటి ధాత్రి కథనానికి, నాచుపల్లి గ్రామ సర్పంచ్ బొడ్డెల్లి నాగమణి సూచిక బోర్డులు ఊర్ల పేర్లకు కప్పిన చోట తీగలు, చెట్లు, గడ్డి, కప్పి, ఉన్న వాటిని తొలగించి ఊర్ల పేర్లు వాన దారులకు కనబడేలా సర్పంచ్ కుమారుడు బొడ్డెల్లి భరత్ దగ్గరుండి పని చేయించడం జరిగింది. ఇది చూసిన ప్రయాణికులు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆదివాసి కోయ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఆర్కా రాజారాం



**మంచిర్యాల, నేటిధాత్రి:** మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఆదివాసి కోయ సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేయగా, నస్పూర్ మండలం అరుణక్కనగర్కు చెందిన ఆర్కా రాజారాంను జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియమించారు.ఈ సందర్భంగా ఆర్కా రాజారాం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా సంయుక్త కార్యదర్శి బాధ్యతలు అప్పగించినందుకు ఆదివాసి కోయ సంఘం గౌరవ అధ్యక్షులు నైతం లక్ష్మణ్,జిల్లా అధ్యక్షులు చెడంక మాంతయ్య, ప్రధాన కార్యదర్శి మడ సమ్మయ్యలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదివాసి కోయ సమాజం అభివృద్ధి, హక్కుల పరిరక్షణ,సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.జిల్లాలోని కోయ సమాజ ప్రజలను సంఘటితం చేసి,వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు,విద్య, ఉపాధి,సామాజిక అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులు,సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.జిల్లా కమిటీ ఎన్నిక సందర్భంగా పలువురు నాయకులు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి,ఆదివాసీ సమాజ సంక్షేమానికి ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పై నిరసన

▶▶పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్...



**భూపాలపల్లి, నేటిధాత్రి:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఎఫ్ ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభా వేదికను పసుపు నీటితో శుద్ధి చేయడాన్ని కుల వివక్షగా పేర్కొంటూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అయితే ఆయనపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం రాజకీయ కక్షసాధింపు చర్య అని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. రాహుల్‌పై నమోదైన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని, అసలు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై యూత్ కాంగ్రెస్ నాయకులు బీజేపీ జిల్లా కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు బీజేపీ కార్యకర్తలు కార్యాలయం వద్దకు చేరుకుని కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత ఏర్పడగా, పోలీసులు భారీగా మోహరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ బీజేపీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, ఐ ఎన్ టి యు సి నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా నాయకురాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు



పరకాల, నేటిధాత్రి: ఎమ్మెల్యే శ్రీ రేగూరి ప్రకాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పరకాల వ్యవసాయ మార్కెట్ కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.యూనియన్ అధ్యక్షులు లంక దాసరి అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రేగూరి ప్రకాష్ రెడ్డి ప్రజాసేవకు అంకితమై నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ప్రజలు,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గం డైరెక్టర్లు,వ్యాపారస్తులు,హమాలీకార్మికులు,గుమస్తాల,దాదువాయిలు,గంప కూలీలు,కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఊకె శిరీష ను హత్యాచేసిన కిరాతకుడిని తక్షణమే ఉరి తీయాలి



**గుండాల, నేటిధాత్రి:** గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటి యు ఆధ్వర్యంలో ఊకే శిరీష ను హత్య చేసిన కిరాతకుడిని తక్షణమే ఉరి తీయాలని సిఐటియు నాయకులు వజ్జ సుశీల డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతోటి రోజుకి మహిళలపై దాడులు మానభంగాలు హత్యలు పెరిగిపోతున్నాయని ఇలాంటి చర్యలు నివారించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలను రక్షించే విధంగా కఠినమైన చట్టాలను తీసుకురావాలని నిఘా వ్యవస్థ ఈ రాష్ట్రంలో ఉందా లేదా అనేది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. శిరీష కుటుంబానికి 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆ కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని సిఐటి మండల కమిటీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యక్క,ఆదిలక్ష్మి,వినోద, అమ్మక్క, లక్ష్మి,భద్రక్క, రమాదేవి, సరోజ, ఆదిలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, ఎం లక్ష్మి,విజయలక్ష్మి, కళావతి,వెంకటమ్మ, అనసూర్య, వసంత రత్నకుమారి, రామక్క తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ్, పద్మావతి రెడ్డిలపై వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు:

## కాంగ్రెస్ నేత రావెల కృష్ణారావు మండిపాటు



**కోదాడ, నేటిధాత్రి:** మాజీ ఎమ్మెల్యే బొల్లం పై కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావెళ్ల కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లపై మాజీ ఎమ్మెల్యే బొల్లం చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన మంగళవారం తీవ్రంగా ఖండించారు. గతంలో రూ.5 కోట్లు తీసుకున్నారనే ఆరోపణలు నిజమా? కాదా? అన్న విషయాన్ని ప్రజలకు స్పష్టం చేయాలని రావెళ్ల కృష్ణారావు డిమాండ్ చేశారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు, నాయకుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించారనే ఆరోపణలు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత మాజీ ఎమ్మెల్యేపై ఉందన్నారు. ఆరోపణలకు సమాధానం చెప్పకుండా రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు కాకుండా వాస్తవాలు ప్రజల ముందుంచాలని సూచించారు. వ్యక్తిగత విమర్శలు, పరస్పర ఆరోపణలతో రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేయవద్దని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే ముందుగా తనపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పి, అనంతరం కాంగ్రెస్ నాయకులపై మాట్లాడాలని రావెళ్ల కృష్ణారావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదని, పార్టీ శ్రేణులు ఐక్యంగా ఎదుర్కొంటాయని ఆయన స్పష్టం చేశారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన

**పారదర్శకంగా పరిశీలన పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్....**



**జగిత్యాల, నేటిధాత్రి:** జగిత్యాల మండలం మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కింద వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్ కు సంబంధించి అందిన దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను సంబంధిత స్థలాల్లో పరిశీలించారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలు, స్థల పరిస్థితి, లేఅవుట్‌కు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వాస్తవ పరిస్థితులను పూర్తిగా నమోదు చేసి, అర్హత కలిగిన దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన వివరాలను టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి తదితర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యాలయంపై దాడి హేయమైన చర్యలి



▶▶బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి...

**నర్సంపేట, నేటిధాత్రి:** బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంపై, నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య అని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన కొందరు వ్యక్తులు రాజకీయంగా బీజేపీని ఎదుర్కొనే ధైర్యం లేక దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించాలే తప్ప ప్రత్యర్థి పార్టీ కార్యాలయాలు, నాయకుల ఇళ్లపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. రాజకీయ సిద్ధాంతాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని, రాళ్లు, కర్రలతో కాదని పేర్కొన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడి ఒక పార్టీపై జరిగిన దాడి మాత్రమే కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడిగా భావించాల్సి ఉంటుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రాజకీయ కక్షలు, దాడుల సంస్కృతికి తెరలేపడం దురదృష్టకరమన్నారు. దాడులకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నాంపల్లి ఘటనకు నిరసనగా నర్సంపేట నియోజకవర్గంలో బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. దాడులతో బీజేపీని అడ్డుకోలేరని, ప్రజా పోరాటంతో కాంగ్రెస్‌కు తగిన సమాధానం చెబుతామని అన్నారు. ఈకార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ జూలూరి రోజా రాణి, పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రాంచేందర్‌రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి జీవన్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్‌గౌడ్, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, నల్లబెల్లి మండల అధ్యక్షుడు తడుక వినయ్‌గౌడ్, నెక్కొండ మండల అధ్యక్షుడు నాయిని అశోక్, దుగ్గొండి మండల అధ్యక్షుడు రాజేందర్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు శేఖర్, సీనియర్ నాయకులు కోమల్‌రెడ్డి, అబోతు రాజు, బాల్నే జగన్, మహేందర్‌రెడ్డి, దుంకా దువ్వ రంజిత్, అన్న లింగయ్య, బచ్చు ఎంకన్న, సమ్మయ్య, నూనె రంజిత్, మహిళా నాయకురాళ్లు సరిత, ప్రతిక్ష సింగ్, కాసుల నాగేంద్రబాబు, వల్లె పర్వతాలు, ముత్యాల శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, ఉపాధ్యక్షులు కొంకిసా విగ్నేష్‌గౌడ్, ఎర్ర రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

## మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి




**గుండాల, నేటిధాత్రి:** మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఊకె శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని టిడిపి గుండాల మండల కమిటీ డిమాండ్ చేశారు.మంగళవారం విలేకరులతో మాట్లాడుతూములకలపల్లి మండలం చౌటి గూడెం గ్రామానికి చెందిన నిరుపేద ఆదివాసి మహిళా నర్సింగ్ విద్యార్థి పై రెండు రోజుల క్రితం హైదరాబాదులో అత్యాచారం జరిగిందని అత్యాచారం చేసిన దుండగులను ఇప్పటివరకు ప్రభుత్వం పట్టుకోక పోవడమేంటని ప్రశ్నించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగి ఎన్నో కష్టాలను కోర్చి బ్రతుకుతెరువు కోసం పట్టణాలకు వెళ్లిన పేద అణగారిన వర్గాలకు రక్షణ కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని ఊకె శిరీష విషయంలో అదే జరిగిందని గతంలో ఇలాంటి ఘటనలు అగ్రవర్ణాలకు జరిగితే వెంటనే స్పందించి శిక్ష విధించిన పాలకులు ఇప్పుడెందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని శిరీష కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగం వారి కుటుంబ సభ్యులకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు తోలెం సాంబయ్య,ఇల్లందుల అప్పారావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఇల్లందుల నరసింహులు, మొల్కం మధు,చీకటి యాకయ్య,మొల్కం రామకృష్ణ,వాగబోయిన హుషార్,రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఐడి కార్డుల పంపిణీ



**కొడిమ్యాల, నేటిధాత్రి:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రం కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం విద్యార్థి ఐడి కార్డులను అందజేశారు. చొప్పదండి మార్కెట్ కమిటీ పూర్వ చైర్మన్ కొత్తూరు మహేష్ సహకారంతో మోడల్ స్కూల్ విద్యార్థులకు ఐడి కార్డులు అందజేశారు. గ్రామస్తులు నాయకుల సహకారంతో విద్యార్థులు చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ పాఠశాల ప్రగతి పథంలో సాగుతుందని ప్రిన్సిపాల్ బి లావణ్య అన్నారు. ఈ సందర్భంగా సహకరించిన కొత్తూరు మహేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచిఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల కొనుగోలు




**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలంలో రేపటి నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ సేవలు ప్రారంభం కానున్నట్లు మండల వ్యవ సాయ అధికారి మార్క ప్రియదర్శిని తెలిపారు ఈ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన అన్ని రకాల సబ్సిడీ ఎరువులను ఒకే యాప్ ద్వారా సులభం గా పొందే అవకాశం కల్పిం చబడుతుందని తెలిపారు. ఎరువుల కొనుగోలు ప్రక్రియను మరింత పారద ర్శకంగా, సులభతరంగా మరియు రైతులకు అను కూలంగా నిర్వహించేందుకు ఈ విధానం ఉపయోగపడు తుందనిపేర్కొన్నారు.రైతులు ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో ఆధార్ నంబర్, రైతు ఐడీ (Farmer ID)ద్వారా లాగిన్ అయిఅందుబాటులో ఉన్న సబ్సిడీ ఎరువుల వివరా లను తెలుసుకొని, అవస రమైన ఎరువులను కొను గోలు చేసుకోవచ్చని తెలి పారు.రైతులు ఎరువుల కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, యాప్ వినియో గంపై సందేహాలు ఉన్నా లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను ఏ ఈఓలను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలను వ్యవసాయ శాఖ సిబ్బంది అందిస్తారని తెలిపారు.రైతులందరూ ఈ కొత్త విధానాన్ని సద్వినియోగం చేసుకొని,సబ్సిడీ ఎరువు లను ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా సక్రమమైన విధానంలో కొనుగోలు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ రైతులను కోరడమైనది.

## రాహుల్ గాంధీ పై అక్రమ కేసు పెట్టడం సిగ్గుచేటు - ఎంపీ బలరాం నాయక్



▶▶ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని కాపాడాలి - ఎమ్మెల్యే మురళి నాయక్

▶▶బిజెపి కుట్రలను ఎండగడతాం - కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉమా నాయక్...

▶▶ప్రజాస్వామ్యంలో కొట్లాడుతాం - కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్....

▶▶మహబూబాబాద్ లో కాంగ్రెస్ నాయకుల మహా ధర్నా....

**మహబూబాబాద్, నేటిధాత్రి:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్ల ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో బీజేపీ--ఆరెస్సెస్ శ్రేణులు వ్యవహరించిన వివక్షాపూరిత వైఖరిని ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అక్రమంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ఆందోళనలో ముఖ్య ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీజేపీ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎంపీ బలరాం నాయక్: "సామాజిక న్యాయం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం గళమెత్తిన రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటూ తప్పుడు కేసులు బనాయించడం లజ్జాకరం. ఖర్గే సభ ప్రాంగణాన్ని 'శుద్ధి' పేరిట అవమానించిన వారిపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించిన వారిపై కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. వెంటనే ఆ కేసులను ఉపసంహరించుకోవాలి."ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలి– ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్: "దేశంలో రాజ్యాంగ విలువలపై బీజేపీ నిరంతరం దాడి చేస్తోంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది.బిజెపి కుట్రలను ఎండగడతాం –డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళీ నాయక్: "ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు బీజేపీ పన్నుతున్న కుట్రలను ప్రజల మధ్య ఎండగడతాం. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు."ప్రజాస్వామ్యంలో కొట్లాడుతాం– కేసముద్రం మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్: "అణచివేత ధోరణులను నిరసిస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటాలు కొనసాగిస్తాం. రాహుల్ గాంధీకి దేశ ప్రజల మద్దతు ఉందనే విషయం బీజేపీ గుర్తుంచుకోవాలి.""?ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి రమేష్, మండల అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్, ఇనుగుర్తి మండల అధ్యక్షుడు అశోక్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌తో పాటు స్థానిక కౌన్సిలర్లు,వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేశారు.

## ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి.





**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్ ప్రతి మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఈరోజు తంగళ్ళపల్లి మండలం దేశాయి పల్లి గ్రామంలో పర్యటించారు ఈ సందర్భంగా. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగు తోటి రైతులకు నిరంతరం ఆదాయం వస్తుందని. తంగళ్ళపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో కంకణాల రమేష్. కంకణాల రాజు దాదాపు నాలుగు ఎకరాల్లో బీరకాయలు. టమాట. మిర్చి. సొరకాయ. బంతి సాగు చేస్తున్నారని ఎల్.నీ నో ప్రభావం. ఇబ్బందులు అధిగమించేందుకు రైతు కంకణ ల రాజు తనకు ఉన్న రెండు ఎకరాలలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆదాయం పొందాలని ఉద్దేశంతో వరికి బదులు ఇతర పంటలు సాగు చేస్తున్నరని అలాగే పంపాడునిర్మాణంలో భూగర్భ జలాల వృద్ధి చెంది ఆదాయం పొందెందుకు మార్గం ఏర్పడిందని. మిగతా రైతులు కూడా తమకు ఉన్న భూమిలో అడుతడి పంటలు కూరగాయలు సాగు చేసి ఆదాయం పొందాలని ప్రస్తుత వాతావరణ ఇబ్బందుల నుంచి బయట పడాలని పిలుపునిచ్చారు ఉద్యానవన శాఖ ఇతర శాఖల నుంచి వచ్చే ప్రభుత్వ సహాయం తీసుకోవాలని రైతులకు సూచిస్తూ. ప్రస్తుతం బీరకాయ దీనిలో మల్చింగ్ విధానంలో అంతర పంటగా టమాటా మిర్చి సాగు చేస్తున్నారు అలాగే సొరకాయ బంతిపూలు సాగు చేస్తున్నారని ప్రస్తుతం బీరకాయ పంట చేతికి వచ్చిందని టమాటా దిగుబడి మరికొద్ది రోజుల్లో చేతికి వస్తుందని మిర్చి బంతి తోట బతుకమ్మ వరకు చేతికి రానుందని. బీరతోట నాటికి 45 రోజుల తర్వాత పంట చేతికి రావడం మొదలై దాదాపు 40 రోజుల నుంచి రెండు నెలల వరకు దిగుబడి వస్తుందని ఎకరానికి అన్ని ఖర్చులు పోను రైతుకు 80 వేల నుంచి లక్ష వరకు ఆదాయం సమకూరుతుందని రైతు రాజుచెప్పారు మరికొద్ది రోజుల్లో టమాట బంతి ఆదాయం రానుందని వివరించారు రైతు కంకణాల రాజు తన పొలంలో గత ఏడాది ఒక గుంట స్థల విస్తీర్ణంలో పంపాడ్ తవ్వించారని దానిలో వర్షాకాలంలో నీరు నిలిచి తన బోర్లలో నీరు సమృద్ధిగా వస్తుందని తన కూరగాయలకు పూల సాగుకు నీరు పుష్కలంగా అద్దుతుందని డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని సాగుకు అందిస్తున్నారు ఎల్ ని నో నేపథ్యంలో భూగర్భ జ లాలకు ఇబ్బంది లేదు అని. ముఖ్యంగా మత్స్య చేపలను రైతు కంకణాల రాజు తన పొలంలో పాంపాడ్ నీరు నింపి కోరమీను రవులుచేప పిల్లలు వేశారని సహజ పద్ధతిలో వాటిని పెంచుతున్నారని ప్రతి ఆరు నెలలకు ఒకసారి చేపలు పట్టి విక్రయిస్తుండగా 40,000 వరకు ఆదాయం వస్తుందని తెలిపారు రైతులు తెలిపారు. ఇట్టి పరిశీలనలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ. జిల్లా వ్యవసాయ శాఖఅధికారి అఫ్జల్ బేగం. ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు. ప్రభుత్వ అధికారులు రైతులు తదితరులు ఉన్నారు

## టాక్సీ డ్రైవర్... ఓనర్స్ మండల కమిటీ ఎన్నిక

**టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ మండల అధ్యక్షుడిగా షేక్ నాగుల్ పాషా ఉపాధ్యక్షులుగా మర్రిపెల్లి రాజేష్**



**కేసముద్రం, నేటిధాత్రి:** కేసముద్రం మండల కేంద్రంలోని గౌడ సంఘం ఫంక్షనాల్లో మంగళవారం టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడిగా షేక్ నాగుల్ పాషా, ఉపాధ్యక్షులుగా మర్రిపెల్లి రాజేష్ అలియాస్ సన్నీ, కార్యదర్శిగా గొట్టం లక్ష్మణ్, కోశాధికారిగా చాపల మధును ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో టాక్సీ డ్రైవర్లు,వాహన యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సభ్యులు తెలిపారు.ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## యూని పాశీలు త్వరగా అందించాలి జిల్లాకలెక్టర్ గ రీమఅగ్రవాల్.



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం మండపల్లి గ్రామంలో శ్రీ రేణుకా మాత మహిళా శక్తి టైలరింగ్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో యూనిఫామ్ లు కుట్టించే బాధ్యత అప్పగించిందని మహిళా సంఘాల సభ్యులు త్వర త్వరగా యూనిఫాంలో పూర్తి చేసి ఇవ్వాలని ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పనిని పూర్తిగా చేయాలని. విద్యాలయాల విద్యార్థులకు యూనిఫాంలో కుట్టించడంతో మహిళా సంఘాలకు ఉపాధి మార్గం చూపుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలో కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగిందని ప్రతి జిల్లాలలో ప్రక్రియ కొనసాగుతుందని. ప్రతి మహిళ రోజు ఎండి యూనిఫామ్ లు కుడతారు అని ఎంత ఆదాయం వస్తుందని అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తంగళ్ళపల్లి మండలంలో ఎన్ని ఉన్నాయని అడిగాగా మండలంలో మొత్తం 43 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 3560 విద్యార్థినిలు విద్యార్థులకు రెండు జాతల చొప్పున ఏకరూప దుస్తులు నాలుగు కేంద్రాల ద్వారా 28 మంది మహిళ సంఘాల సభ్యులతో కుట్టిస్తున్నామని వీటి ద్వారా రూ;5.34.000. మొత్తం ఆదాయం సమకూరుందని అధికారులు జిల్లా దృష్టికి తీసుకువెళ్లారు ఇట్టి పరిశీలనలో. DRDO. లక్ష్మీనారాయణ. అదనపు. RDO. శ్రీనివాస్. ఇన్చార్జి. MRO. మురళి. MPDO. రమేష్. ప్రభుత్వ అధికారులు కుట్టు మిషన్ సంఘాలవారు తదితరులు ఉన్నారు

# నేటిధాత్రి 9 NETI DHATHRI



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం



పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం" " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444




మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

సంప్రదించవలసిన చిరునామా..

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# ఆరోగ్యం కోసం స్త్రీలు ఈ 4 పనులు తప్పక చేయాలి

## నెలరోజుల్లోనే తేడా కనిపిస్తుంది!



దెస్క్,నేటిధాత్రి:
మహిళలు ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకొనే వరకు ఇంటాబయట పనులతో ఫుల్ బిజీగా ఉంటారు. నిమిషం తీరిక లేకుండా పనుల్లో నిమగ్నమైపోతారు. అయితే గృహ బాధ్యతల కారణంగా మహిళలు తరచుగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు. కానీ ఏ వయస్సులోనైనా, వారి జీవనశైలిని కొద్దిగా మార్చడం ద్వారా, వారు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, వ్యాధులను నివారించవచ్చు వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుంది. కాబట్టి మహిళలు గుర్తుంచుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని ఆరోగ్యంగా ఉంచుకోగల ప్రాథమిక విషయాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

శారీరక శ్రమ: క్రమం తప్పకుండా వ్యాయామం చేసే స్త్రీలకు మెరుగైన రక్తపోటు కొలెస్ట్రాల్ స్థాయిలు ఉంటాయి. గుండె జబ్బులు, మధుమేహం , బీపీ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. మహిళలు మెనోపాజ్‌కు చేరుకోవడం , శారీరకంగా చురుకుగా ఉండటం వలన, వారు అనేక సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. కాబట్టి ప్రతి స్త్రీ వారానికి 4-5 రోజులు 30-60 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.

### చక్కగా నిద్రపోండి:

ఆధునిక జీవనశైలి కారణంగా చాలా మంది మహిళలకు రాత్రిపూట నిద్రపోవడం కష్టంగా మారుతోంది. అయితే మీ ఇతర బాధ్యతల మాదిరిగానే నిద్రకు కూడా ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. విశ్రాంతి తీసుకోవడానికి తగినంత నిద్ర పొందడం వలన మీరు ఆరోగ్యంగా ఉండటానికి , మీ శరీరాన్ని శక్తివంతంగా ఉంచడంలో సహాయపడుతుంది.

శారీరక పరీక్ష : ఏటా మీ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని నిర్ధారించుకోండి, ఇది మీకు ఏదైనా తీవ్రమైన అనారోగ్యం వచ్చే ప్రమాదం నుంచి వెంటనే బయటపడేలా చేస్తుంది. అటువంటి పరిస్థితిలో, వైద్యులు అధిక రక్తపోటు , అధిక స్థాయి అనారోగ్య కొలెస్ట్రాల్ వంటి ప్రాథమిక విషయాలను తనిఖీ చేస్తారు.

### ఆహారంపై శ్రద్ధ వహించండి:

మీరు తినే దానిపై శ్రద్ధ వహించండి. ఆరోగ్యకరమైన ఆహారం అంటే రుచి లేని ఆహారం కాదు. బదులుగా, ఇది ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు , కార్బోహైడ్రేట్లతో కూడిన భోజనం తినాలి . మీరు దీనికి రకరకాల కూరగాయలు , పండ్లను జోడించవచ్చు.

# చలికాలంలో జలుబు, దగ్గు వేధిస్తోందా?

●“ఉసిరి టీ” తాగితే మంచిదట! – పైగా ఈ ప్రయోజనాలు కూడా! ఆయుర్వేదంలో ఉసిరి వినియోగం అధికం

●ఇండియన్ గూస్ బెర్రీతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు



హైదరబాద్,నేటిధాత్రి:
చలికాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంటుంది. ఈ సీజన్‌లో శరీరం నిస్తేజంగా మారడమే కాదు.. వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది. వైరస్‌లు, బ్యాక్టీరియాలు వేగంగా శరీరంలోకి చేరి.. జలుబు, దగ్గు, జ్వరాలు ఇబ్బందిపెడుతుంటాయి. ఇలాంటి సమయంలో ఇమ్యూనిటీ పెంచే ఆహారాలు తీసుకోవాలి. తద్వారా ఎలాంటి రోగాలతో అయినా పోరాడే సామర్థ్యం లభిస్తుంది. అలా ఇమ్యూనిటీ అందించే ఫుడ్స్?లో ఉసిరితో తయారయ్యే టీ కూడా ఒకటి. మరి దీని వల్ల కలిగే ప్రయోజనాలు, ఎలా తయారు చేసుకోవాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం..

### ఉసిరి టీ ఆరోగ్య ప్రయోజనాలు:

రోగ నిరోధక శక్తిని పెంచుతుంది: ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరస్తుందని.. ఫలితంగా శరీరం బాక్టీరియా, వైరస్‌లతో సమర్థవంతంగా పోరాడగలుగుతుందని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ శుభాంగి తమ్మళ్వార్ అంటున్నారు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు జలుబు వల్ల కలిగే గొంతు నొప్పి, వాపు వంటి లక్షణాలను తగ్గిస్తాయని అంటున్నారు.

జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది : ఉసిరి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్నారు. ముఖ్యంగా మలబద్ధకాన్ని నివారిస్తుందని చెబుతున్నారు. అంతేకాదు.. ఉసిరి.. జీర్ణ రసాల స్రావాన్నీ ప్రేరేపించి పోషకాల శోషణను మెరుగుపరుస్తుందని.. ఫలితంగా అజీర్ణం, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గిపోతాయంటున్నారు.

కళ్ల ఆరోగ్యానికి మంచిది: ఉసిరి కళ్ల ఆరోగ్యానికి చాలా మంచిదని అంటున్నారు. ఇది కంటి చూపును మెరుగుపరుస్తుందని, గ్లాకోమా వంటి కంటి సమస్యలను నివారిస్తుందని అంటున్నారు. అలాగే ఉసిరిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కంటి వాపును తగ్గించి.. కంటి ఎరుపు, దురద వంటి సమస్యలను తగ్గిస్తుందని చెబుతున్నారు.

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: ఉసిరిలో యాంటీ-డయాబెటిక్ లక్షణాలు అధిక పరిమాణంలో ఉంటాయని.. రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయులు తగ్గుతాయని అంటున్నారు. 2020లో జర్నల్? ఆఫ్ ఆయుర్వేద అండ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. ఆమ్లా సారం గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుందని, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుందని కనుగొన్నారు.

కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది: ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తుందని అంటున్నారు. తద్వారా గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గుతుందని అంటున్నారు.

ఫ్రీ రాడికల్స్ నష్టం తగ్గుతుంది : ఉసిరిలోని విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుందని నిపుణులు అంటున్నారు. అలాగే ఈ పండులో పాలీఫెనాల్స్, టానిన్, ఫ్లేవనాయిడ్లు ఉంటాయని.. ఇవన్నీ శరీరాన్ని ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఫ్రీ రాడికల్ డ్యామేజ్ నుంచి రక్షించడంలో చాలా బాగా సహాయపడతాయంటున్నారు.

జుట్టు, చర్మ ఆరోగ్యానికి మేలు : ఉసిరిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు జుట్టు, చర్మ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా వెంట్రుకల కుదుళ్లు బలంగా మారి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుందంటున్నారు. అలాగే, ఉసిరి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు స్కిన్ ఇరిటేషన్, మొటిమలను తగ్గిస్తాయని.. వృద్ధాప్య ఛాయలను దూరం చేస్తాయంటున్నారు.

క్యాన్సర్?ను నిరోధించడం: ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించడంలో సహాయపడతాయని అంటున్నారు. ఇదే విషయాన్ని %చీ×ఎ% సభ్యుల బృందం కూడా స్పష్టం చేసింది.(రిపోర్ట్ కోసం ఇక్కడ క్లిక్?చేయండి).

ఉసిరి టీ ఎలా తయారు చేయాలంటే: గిన్నెలోకి ఓ గ్లాస్ నీళ్లు పోసి చెంచా ఎండబెట్టిన ఉసిరి పొడి, కొద్దిగా అల్లం తరుగు, రెండు తులసి ఆకులు, చిటికెడు వేయించిన జీలకర్రపొడిని వేసి బాగా మరగబెట్టాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు తేనె, నిమ్మరసం చేర్చి తాగితే సరి. లేదంటే తాజా ఉసిరికాయను తురిమి మిక్సీలో పేస్టులా చేసుకోవాలి. దాన్ని నీళ్లలో మరిగించి కూడా టీ రూపంలో తీసుకోవచ్చు.

NOTE : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# బీట్‌రూట్‌ను రోజూ ఎందుకు తినాలో తెలుసా..?

## కారణం తెలిస్తే వెంటనే తినడం మొదలుపెడతారు..!



బీట్‌రూట్ అంటే చాలా మందికి ఇష్టం ఉండదు. దీని రుచి చాలా మందికి నచ్చదు. అలాగే బీట్‌రూట్‌ను ముట్టుకుంటే చాలు రంగు అంటుతుంది. కనుక దీన్ని తినేందుకు చాలా మంది అంత ఇష్టతను ప్రదర్శించరు. అయితే వాస్తవానికి బీట్‌రూట్‌ను సూపర్ ఫుడ్ అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి. అనేక విటమిన్లు, మినరల్స్ బీట్‌రూట్‌లో ఉంటాయి. కనుక బీట్‌రూట్‌ను తినాలని వారు సూచిస్తున్నారు. బీట్‌రూట్‌ను రోజూ తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని వారు అంటున్నారు. బీట్‌రూట్‌లో నైట్రేట్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. దీంతో రక్తనాళాలు వెడల్పుగా మారుతాయి. దీని వల్ల రక్త సరఫరాకు ఉండే అడ్డంకులు తొలగిపోయి రక్తం సరిగ్గా సరఫరా అవుతుంది. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది.

### గుండె జబ్బులు రావు..

బీట్‌రూట్‌ను తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో వెల్లడైంది. కనుక బీట్‌రూట్‌ను రోజూ తింటే గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. బీట్‌రూట్‌లో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల కణాలు డ్యామేజ్ అవకుండా చూసుకోవచ్చు. అలాగే తీవ్రమైన వ్యాధులైన క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. బీట్‌రూట్ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ చాలా తక్కువ. అలాగే ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటుంది. కనుక బీట్ రూట్‌ను తింటే బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. డయాబెటిస్ ఉన్నవారు బీట్‌రూట్‌ను తింటుంటే రక్తంలో చక్కెర స్థాయిలను చాలా సులభంగా మేనేజ్ చేసుకోవచ్చు. డయాబెటిస్‌ను అదుపు చేయవచ్చు.

### బరువు తగ్గవచ్చు..

బీట్‌రూట్‌లో ఉండే నైట్రేట్లు మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. దీంతో ఇవి మెదడుకు రక్త సరఫరాను పెంచుతాయి. దీని వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. మెదడు యాక్టివ్‌గా మారుతుంది. ఉత్సాహంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి బీట్‌రూట్ ఎంతో మేలు చేస్తుంది. దీన్ని తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు తగ్గాలని చూస్తున్నవారు కచ్చితంగా బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి.

### జీర్ణ వ్యవస్థ పనితీరుకు..

బీట్‌రూట్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. అలాగే వ్యాధులను తగ్గిస్తుంది. దీంతో సీజనల్‌గా వచ్చే వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. బీట్‌రూట్‌ను రోజూ తినడం వల్ల లివర్ శుభ్రంగా మారుతుంది. లివర్‌లోని వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం కూడా అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. బీట్‌రూట్‌లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది. మలబద్దకం సమస్య ఉన్నవారు రోజూ బీట్‌రూట్ ను తింటే త్వరగా ఆ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇలా బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.



# మీ జుట్టుకు రక్షణ ఈ పొడులే!

ఆయుర్వేదంలో జుట్టును సంరక్షించుకోవటానికి అనేక పద్ధతులు ఉన్నాయి. వీటిలో హెయిర్‌మాస్కలను తయారుచేసుకోవటం ఒక ప్రధానమైన అంశం. ఈ హెయిర్‌మాస్కను ఎలా తయారుచేసుకోవాలో చూద్దాం..

### తయారీ విధానం

మన జుట్టును సంరక్షించే అనేక రకాల పౌడర్లు మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఒక గిన్నెలోకి తీసుకొని.. వాటిని నీటితో కానీ.. పెరుగుతో కానీ.. కొబ్బరినూనెతో కానీ కలపాలి. ఆ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి 30 నిమిషాలు వదిలేయాలి. ఆ తర్వాత షాంపుతో జుట్టును కడగాలి. ఇప్పుడు ఆ పౌడర్లు ఏమిటో చూద్దాం..

### భృంగరాజ పొడి

భృంగరాజను మూలికల్లో రారాజుగా పిలుస్తారు. ఇది జుట్టును బలంగా చేస్తుంది. జుట్టు ఊడిపోకుండా కాపాడుతుంది. కొందరిలో జుట్టు తెల్లపడకుండా అడ్డుకుంటుంది.

### ఉసిరి పొడి

ఉసిరి పొడిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది జుట్టు నిగనిగలాడేలా చేస్తుంది. జుట్టు బలంగా పెరగటానికి ఉపకరిస్తుంది.

### వేప పొడి

కొందరికి మాడుపై బ్యాక్టీరియా చేసి రకరకాల సమస్యలు ఏర్పడుతూ ఉంటాయి. దురద పెడుతూ ఉంటుంది. ఈ సమస్యలకు వేప పొడి మంచి పరిష్కారమని చెప్పాలి.

### మందార పొడి


మందారంలో విటమిన్స్, అమినో యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి జుట్టు ఊడిపోకుండా రక్షిస్తూ ఉంటాయి.

### మెంతి పొడి

మెండి పొడిలో ప్రొటీన్, నికోటినిక్ యాసిడ్‌లు ఉంటాయి. ఇవి జుట్టు ఉడిపోకుండా రక్షణ కవచంలా పనిచేస్తాయి. మెంతి పొడిని పెరుగుతో కలిపి రాస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయి.

### కుంకుడు పొడి

జుట్టులో ఉండే దుమ్మును తొలగించటంలో కుంకుడు పొడి ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. దీని వల్ల జుట్టులో సహజంగా ఉండే నూనెలకు ఎటువంటి ప్రమాదం ఉండదు. షికాకాయ్ పొడి కూడా జుట్టు ఆరోగ్యంగా పెరగటానికి ఉపకరిస్తుంది.



# బిగిసడలిన అందాలకు అద్భుతమైన వ్యాయామాలు

అందానికి మగువలు ఇచ్చే ప్రాధాన్యం అంతాఇంతా కాదు. వివాహం జరిగి పిల్లలు పుట్టాక వారిలోని బిగువు కొంత సడలుతుంది. దీంతో వారిలో ఆందోళన మొదలవుతుంది. వక్షోజాలు వదలు కావడాన్ని చాలామంది జీర్ణించుకోలేరు. అయితే, ఇందుకు బోల్డన్ని కారణాలు కూడా ఉండొచ్చు. అంటే జీవనశైలి, జెనెటిక్స్, ఆరోగ్యంపైనా ఇది ఆధారపడి ఉంటుంది. ఇలాంటి వారికి 20 ఏళ్ల వయసులోనే వక్షోజాల బిగుత సడలిపోయి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ మాత్రానికే కుంగిపోవాల్సిన అవసరం లేదు. చిన్నచిన్న వ్యాయామాల ద్వారా వదులైన వక్షోజాలను బిగుతుగా చేసుకోవచ్చు. పూర్వ స్థితికి తీసుకురావొచ్చంటున్నారు నిపుణులు. అవేంటో ఇప్పుడు చూద్దాం.

వైడ్ టు క్లోజ్ పుషప్

ఈ వ్యాయామం కోసం తొలుత పుషప్ పొజిషన్ తీసుకోవాలి. చేతులు సరిగ్గా మీ భుజాల కింద కాస్త ఎడంగా ఉండాలి. ఆ తర్వాత వ్యాయామం ప్రారంభించాలి. ఈ క్రమంలో వక్షోజాలు నేలకు తగిలేలా పుషప్స్ చేయాలి. ఆ తర్వాత మళ్లీ పైకి లేవాలి. ఇలా కిందికిపైకి 15 రెప్స్‌తో 3 సెట్లు పూర్తిచేయాలి.

డంబెల్ బెంచ్ ప్రెస్

ఈ వ్యాయామంలో వెనక ఓ ఏటవాలు బెంచ్ లాంటిది ఉండాలి. దానికి ఆనుకుని రెండు చేతుల్లో రెండు డంబెల్స్ పట్టుకోవాలి. అరచేతులు పాదాలకు ఎదురుగా ఉండాలి. ఇప్పుడు కాళ్లను గాల్లోంచి నేలపైకి నెమ్మదిగా తీసుకొచ్చి ఊపిరి తీసుకోవాలి. ఇప్పుడు డంబెల్స్ ఉన్న చేతలను చాతీపైకి నిలువుగా తీసుకురావాలి. ఈ క్రమంలో డంబెల్స్ రెండు ఒకదాన్ని ఒకటి నెమ్మదిగా తాకాలి. అంటే చేతులు ‘వి’ ఆకారంలో కదలాలన్నమాట. ఆ తర్వాత చేతులను నెమ్మదిగా కిందికి దించాలి. ఇప్పుడు శ్వాసను విడిచిపెట్టాలి. ఆ తర్వాత మళ్లీ మునుపటిలా చేయాలి. ఇలా 15 రెప్స్‌తో 3 సెట్లు చేయాలి.

ఇంక్లైన్ డంబెల్ ఫ్లై

డంబెల్ బెంచ్ ప్రెస్‌లానే దీనిని కూడా ఏటవాలు బెంచ్ పైనే చేయాలి. రెండు చేతుల్లో రెండు డంబెల్స్ పట్టుకుని చేతులను నిటారుగా లేపాలి. ఇప్పుడు చేతులను అలాగే వెనక్కి వంచాలి. అంటే సమాంతరంగా తీసుకురావాలి. ఇప్పుడు ఒక క్షణం ఆగి శ్వాసను వదులుతూ చేతులను మళ్లీ యథాస్థానంలోకి తెచ్చుకోవాలి. దీనిని కూడా మూడుసెట్లుగా చేయాలి.

కేబుల్ క్రాసోవర్

ఇందులో మిషన్ పుల్లీ హ్యాండిళ్లను కిందకు లాగాల్సి ఉంటుంది. ఇందుకోసం మొదట మిషన్ రెండు వైపులా పుల్లీలను హై లెవల్‌కు సెట్ చేసుకోవాలి. అలాగే, బరువును సర్దుబాటు చేసుకోవాలి. తొలుత తేలికైన బరువుతో ప్రారంభించి ఆ తర్వాత సౌకర్యంగా అనిపిస్తే బరువును పెంచుకుంటూ పోవచ్చు. మిషన్ మధ్యలో నిలబడి పాదాలను భుజం వెడల్పులో ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు కుడి కాలిని ఒక అడుగు ముందుకు వేసి పుల్లీలను లాగాలి. ఈ క్రమంలో నడుమును కూడా కొంచెం వంచి చాతీ కండరాలు సాగినట్టు అనిపించే వరకు చేతులను చాచాలి. ఊపిరి పీల్చుకుని తిరిగి యథాస్థానానికి రావాలి. ఇలా 15 రెప్స్ చేయాలి.

కోబ్రా పోజ్

ఈ వ్యాయామంలో పొట్టను నేలకు ఆనించి పడుకోవాలి. ఆ తర్వాత అరచేతులను నేలకు ఆన్చాలి. ఆపై నేలను నెడుతూ తలను నెమ్మదిగా పైకి లేపాలి. అలా నడుమును కదపకుండా చాతీభాగం వరకు లేపాలి. ఈ క్రమంలో ఊపిరి పీల్చుకోవడం మర్చిపోకూడదు. తిరిగి ప్రారంభ స్థానానికి వచ్చే వరకు మూడు సెకన్ల పాటు అలాగే ఉండాలి. ఇవి కూడా మూడు సెట్స్ చేయాలి. ఈ వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం ద్వారా వక్షోజాలను తిరిగి పూర్వస్థితికి తీసుకొచ్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు.
ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు.
ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారక నిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు.
ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8 శాతం వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు.
పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు.
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ

- ధరలు మోత మోగిస్తుంటే.. వృద్ధి ఎలా సాధ్యం?
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరాం రమేశ్


న్యూఢిల్లీ , నేటిధాత్రి:
భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణాంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తుతోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు.
కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ.850 నుంచి రూ.1,700కు, అల్యూమినియం ధర రూ.350 నుంచి రూ.650కు చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ.50 వేల నుంచి లక్ష రూపాయలకు పెరిగిందని చెప్పారు.
హోమ్ అప్లయన్సెస్, ఎల్‌ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికుల ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు.
ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితులను తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటిమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు.
ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రతిధ్వనిస్తున్నారని విమర్శించారు. ఈ వృద్ధి రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటును కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.


# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ యథావిధిగా..!



## సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు

## ప్రభుత్వానికి ఊరట.. పథకాల అమలుకు గ్రీన్‌సిగ్నల్




హైదరాబాద్, నేటిధాత్రి:
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం మంగళవారం ఎత్తివేసింది. దీంతో ఈ రెండు పథకాలు యథావిధిగా కొనసాగనున్నాయి.

### కౌంటర్ దాఖలు చేయలేదంటూ స్టే

2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. దీనిని సవాల్ చేస్తూ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది.

### ప్రభుత్వ విధాన నిర్ణయాలపై పిటిషన్ ఎలా?

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలను సవాల్ చేసే హక్కు పిటిషనర్‌కు లేదన్నారు. ఈ పథకాల వల్ల పిటిషనర్‌కు ఎలాంటి నష్టం జరగలేదని, ఆయన లబ్ధిదారు కూడా కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ తరహా సంక్షేమ పథకాలకు సుప్రీంకోర్టు అనుమతి ఉందని, కల్యాణలక్ష్మి కూడా అదే తరహా పథకమని వివరించారు.
ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. సింగిల్ బెంచ్ విధించిన మధ్యంతర స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు యథావిధిగా కొనసాగనున్నాయి.

# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?



నిజామాబాద్, నేటిధాత్రి:
కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురితో రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌కు నమ్మకంగా ఉన్న నేతలను విడదీసి బీఆరెస్‌ను బలహీనపర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది తానా.. కవితనా? అని ప్రశ్నించారు. తాను కాంగ్రెస్ నేతలతో ఎలాంటి మంతనాలు చేయలేదని స్పష్టం చేశారు. 'కవిత కాంగ్రెస్ నాయకులతో రహస్యంగా మంతనాలు చేయలేదని చెప్పగలరా?' అని ప్రశ్నించారు.
తనపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మొదటి నుంచి బీఆరెస్‌కు అండగా ఉన్న నాయకులను కవిత లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. రాజకీయంగా సానుభూతి పొందేందుకే కవిత కన్నీళ్లు పెట్టుకున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.
కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడని, ఆయనపై విమర్శలు చేయడం బాధ కలిగించిందన్నారు. కవితకు రెండుసార్లు ఎమ్మెల్సీ అవకాశం కల్పించడంలో తన పాత్ర ఏమిటో కేసీఆర్‌కు తెలుసని తెలిపారు.

### కాంగ్రెస్ హామీలపై 'బాకీ కార్డుల పూజ'

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆరెస్ ఆధ్వర్యంలో లింబాద్రిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.



# పరకాల గడ్డ..



## 'పరకాల కేవలం ఒక పట్టణం కాదు..స్వేచ్ఛ కోసం రక్తం చిందించిన పోరుగడ్డ'

సెప్టెంబర్ 2 కేవలం ఒక తేదీ కాదు.అమరవీరుల త్యాగాన్ని గుర్తుచేసే చారిత్రక దినం.అమరధామం కేవలం ఒక స్మారకం కాదు స్వేచ్ఛ కోసం ప్రాణాలు అర్పించిన ప్రజల పోరాటానికి శాశ్వత సాక్ష్యం.ఆ త్యాగాలను గుర్తుంచుకోవడం చరిత్రను కాపాడడం భావితరాలకు అందించడం అదే పరకాల అమరవీరులకు నిజమైన నివాళి.



# రక్తంతో రాసిన స్వాతంత్ర్య చరిత్ర

**జెండా కోసం కదిలిన జనసంద్రం...తూటాలకు ఎదురొడ్డి నిలిచిన అమరవీరులు**

**నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన పరకాల నెత్తుటి చరిత్ర**

పరకాల,నేటిధాత్రి
ఒక జెండా కోసం ప్రజలు ఒక్కటయ్యారు.స్వేచ్ఛ కోసం వేలాది అడుగులు పరకాల వైపు కదిలాయి.నిరంకుశ పాలనను ఎదిరించిన ఆ జనసంద్రంపై తుపాకులు గర్జించాయి.రక్తం ఏరులై పారింది.ప్రాణాలు కోల్పోయినా పోరాట స్ఫూర్తి మాత్రం ఆగలేదు.ఇది 1947 సెప్టెంబర్ 2న పరకాల గడ్డపై చోటుచేసుకున్న నెత్తుటి చరిత్ర.భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం పాలనలోనే కొనసాగింది.భారత యూనియన్‌లో విలీనం కావాలన్న ప్రజల ఆకాంక్షకు భిన్నంగా నిజాం పాలన కొనసాగుతుండగా రజాకార్ల దౌర్జన్యాలు,అణచివేతలు ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి.తెలంగాణలో నిజాం వ్యతిరేక ఉద్యమం ఉధృతమవుతున్న కాలమది.అలాంటి పరిస్థితుల్లో పరకాల ప్రాంతం కూడా విముక్తి ఉద్యమానికి ముఖ్య కేంద్రంగా మారింది.ప్రజలను సమీకరించేందుకు ఉద్యమకారులు గ్రామాల్లో తిరిగారు.జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా తమ స్వేచ్ఛా ఆకాంక్షను చాటాలని ప్రజలు నిర్ణయించుకున్నారు.

### జెండా కోసం జనసంద్రం

1947 సెప్టెంబర్ 2న పరకాలలో జాతీయ జెండా ఎగురవేయాలని నిర్ణయించడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.పలు ఆధారాలు వేలాది మంది పరకాల వైపు కదిలినట్లు పేర్కొంటున్నాయి.చాపలబండ ప్రాంతం వద్దకు చేరుకుని ఊరేగింపుగా ముందుకు సాగుతూ జాతీయ నినాదాలు చేశారు.హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలన్న డిమాండ్,స్వేచ్ఛ కావాలన్న ఆకాంక్ష ప్రజల నినాదాల్లో ప్రతిధ్వనించింది.అది కేవలం ఒక ఊరేగింపు కాదు నిజాం పాలనపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి బహిరంగ రూపం.భయాన్ని పక్కనపెట్టి సామాన్య ప్రజలు స్వేచ్ఛ కోసం బయటకు వచ్చిన చారిత్రక సందర్భం అది.

### హెచ్చరికలు ఆ తర్వాత తూటాల మోత

ప్రజలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరడంతో నిజాం పాలనకు చెందిన అధికారులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించినట్లు పలు చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి.ప్రజలు వెనక్కి తగ్గకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.అనంతరం నిజాం పోలీసులు,రజాకార్ల బలగాలు కాల్పులకు దిగినట్లు ఆధారాలు నమోదు చేశాయి.తుపాకీ తూటాలతో పరకాల ప్రాంతం ఒక్కసారిగా రణరంగంగా మారింది.ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశారు.పలువురు ప్రాణాలు కోల్పోయారు.మరెందరో గాయపడ్డారు.కాల్పులతో పాటు రజాకార్లు కత్తులు,బరిసెలు,తల్వార్లతో ఉద్యమకారులను వెంబడించి దాడులకు పాల్పడ్డారు.

### మరో జలియన్‌వాలాబాగ్‌గా పరకాల

పరకాల ఘటనను పలు వార్తా,చారిత్రక కథనాలు జలియన్‌వాలాబాగ్ ఘటనను తలపించిందని అభివర్ణించాయి.జాతీయ జెండా కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో సమీకరమైన సందర్భంలో జరిగిన కాల్పులు ఈ పోలికకు కారణమయ్యాయి.అయితే పరకాల ఘటనను కేవలం కాల్పుల ఘటనగా మాత్రమే చూడలేం.అది హైదరాబాద్ సంస్థానంలో ప్రజల్లో పెరుగుతున్న విముక్తి ఆకాంక్షకు ప్రతిబింబం.స్వేచ్ఛ కోసం సామాన్యులు భయాన్ని పక్కనపెట్టి ఉద్యమంలోకి వచ్చిన ఘట్టం.తుపాకులు ప్రాణాలను తీశాయి.కానీ ఉద్యమ స్ఫూర్తిని మాత్రం ఆపలేకపోయాయి.పరకాల మారణకాండ నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా ఉద్యమంలో చెరగని ముద్ర వేసింది.అమాయక ప్రజలపై జరిగిన కాల్పులు,దాడులు ఉద్యమంపై మరింత ఆగ్రహాన్ని రేకెత్తించాయి.పరకాల ప్రాంతంలో ఉద్యమాన్ని ముందుకు నడిపిన పలువురు నాయకులు,కార్యకర్తలు అణచివేతను ఎదుర్కొంటూనే ప్రజలను సమీకరించారు.జాతీయ జెండా కోసం,స్వేచ్ఛ కోసం,హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలన్న ఆకాంక్ష కోసం సాగిన పోరాటంలో పలువురు ప్రాణత్యాగం చేశారు.వారి త్యాగం తర్వాతి తరాలకు పోరాట స్ఫూర్తిగా నిలిచింది.

### అమరధామం నెత్తుటి చరిత్రకు సజీవ సాక్ష్యం

కాలం గడిచింది.పాలనలు మారాయి.తరాలు మారాయి కానీ పరకాల రక్తచరిత్ర మాత్రం మరుగునపడలేదు.అమరవీరుల త్యాగాలను భావితరాలకు గుర్తుచేసేందుకు పరకాలలో అమరధామం నిర్మించబడింది.అందుబాటులో ఉన్న కథనాల ప్రకారం 2003లో మాజీ కేంద్ర మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో ఆయన తల్లి చంద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఈ స్మారకాన్ని నిర్మించారు.అమరధామంలోని శిల్పాలు నాటి పోరాటం,రజాకార్ల దమనకాండ,అమరవీరుల త్యాగాలను ప్రతిబింబించేలా రూపొందించబడ్డాయి.అమరవీరుల పేర్లను కూడా అక్కడి గోడలపై చెక్కించారు.అందుకే అమరధామం కేవలం ఒక స్మారక నిర్మాణం కాదు. పరకాల నేలపై జరిగిన పోరాటానికి,త్యాగాలకు సజీవ సాక్ష్యం.

### స్వాతంత్ర్యం వచ్చినా విముక్తి కోసం పోరాటం

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం వెంటనే భారత యూనియన్‌లో విలీనం కాలేదు.దీంతో నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం కొనసాగింది.పరకాల వంటి ప్రాంతాల్లో జరిగిన ప్రజా ప్రతిఘటనలు ఈ విస్తృత విముక్తి ఉద్యమంలో భాగమయ్యాయి.చివరకు 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడంతో నిజాం పాలనకు ముగింపు పలికింది.అందుకే పరకాల సెప్టెంబర్ 2 చరిత్రను హైదరాబాద్ విముక్తి ఉద్యమ చరిత్ర నుంచి వేరు చేసి చూడలేం.అమరవీరులను స్మరించుకోవడం అంటే ఏటా ఒకసారి పూలమాలలు వేసి కార్యక్రమం ముగించడం మాత్రమే కాదు.పరకాల చరిత్రను నేటి తరానికి తెలియజేయాలి. పాఠశాలలు,కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి.అమరధామాన్ని చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రదేశంగా పరిరక్షించాలి.ముఖ్యంగా నాటి ఘటనలకు సంబంధించిన పాత పత్రాలు,ఫొటోలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు,ఉద్యమకారుల కుటుంబాల వద్ద ఉన్న జ్ఞాపకాలను సేకరించి భద్రపరచాలి.చరిత్రను పుస్తకాల్లో మాత్రమే ఉంచితే అది క్రమంగా మరుగునపడుతుంది. ప్రజల జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లినప్పుడే అది తరతరాలకు చేరుతుంది.నేడు జాతీయ జెండాను ఎగురవేయడం మనకు సహజమైన హక్కు.పాఠశాలలో,ప్రభుత్వ కార్యాలయంలో ఇంటి వద్ద జాతీయ పర్వదినాల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది.కానీ ఒకప్పుడు అదే జెండాను ఎగురవేయాలనే ఆకాంక్ష కోసం ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టాల్సి వచ్చింది.అందుకే పరకాల అమరవీరుల చరిత్ర నేటి తరానికి ఒక ప్రశ్న వేస్తోంది.మనకు లభించిన స్వేచ్ఛ విలువ మనకు తెలుసా ఆ స్వేచ్ఛ కోసం ప్రాణాలు అర్పించిన వారి చరిత్రను భావితరాలకు అందిస్తున్నామా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది నేటి సమాజమే.పరకాల నేలపై చిందిన రక్తం కాలగర్భంలో కలిసిపోయినా ఆ త్యాగాల జ్ఞాపకం మాత్రం చెరిగిపోలేదు.జాతీయ జెండా కోసం కదిలిన ప్రజలు,తూటాలకు ఎదురొడ్డి నిలిచిన అమరవీరులు,రజాకార్ల దమనకాండ,ఆ తర్వాత మరింత ఉధృతమైన విముక్తి పోరాటం చివరికి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడం ఈ మొత్తం చరిత్రలో పరకాలకు ప్రత్యేక స్థానం ఉంది.

### నెత్తుటి చరిత్రకు సాక్షిగా అమరధామం

పరకాలలో పెరిగిన ప్రతి ఒక్కరికీ అమరధామం గురించి ఎంతో కొంత తెలుసు.కానీ అక్కడికి వెళ్లి అమరవీరుల స్మారకాలను చూస్తే నాటి పరిస్థితులు ఎలా ఉండి ఉంటాయో ఊహించుకోవచ్చు.స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానంలో ప్రజలకు పూర్తి స్వేచ్ఛ లభించని రోజుల్లో జాతీయ జెండా కోసం ఇంతటి పోరాటం జరిగిందంటే అది సాధారణ విషయం కాదు.భయాన్ని పక్కనపెట్టి ప్రజలు బయటకు రావడం,నిరంకుశ పాలనను ఎదిరించడం నేటి తరానికి కూడా స్ఫూర్తినిచ్చే అంశం.ఇలాంటి చరిత్ర కేవలం సెప్టెంబర్ 2న జరిగే కార్యక్రమాలకే పరిమితం కాకూడదు.పాఠశాలల్లో పిల్లలకు పరకాల పోరాటం గురించి వివరించాలి.అమరధామాన్ని సందర్శించేలా ప్రోత్సహించాలి.మనకు ఇప్పుడు స్వేచ్ఛగా కనిపిస్తున్న జాతీయ జెండా వెనుక ఎంతో మంది త్యాగం ఉందనే విషయాన్ని యువత తెలుసుకోవాలి.



పూర్ణ చారి బీజేపీ 9వ వార్డు కౌన్సిలర్



బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్

### పరకాల పోరాటాన్ని భావితరాలకు అందించాలి

నేడు మనం ఎక్కడైనా జాతీయ జెండాను ఎగురవేయగలుగుతున్నాం.జాతీయ పర్వదినాల్లో పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాలు,ఇళ్ల వద్ద త్రివర్ణ పతాకాన్ని గౌరవంగా ఎగురవేస్తున్నాం.కానీ ఒకప్పుడు అదే జెండా కోసం పరకాల ప్రజలు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుకు వచ్చారు.ఈ విషయం గుర్తుచేసుకుంటే స్వాతంత్ర్యం విలువ ఎంత గొప్పదో అర్థమవుతుంది.పరకాల చరిత్రలో సెప్టెంబర్ 2కు ప్రత్యేక స్థానం ఉంది.ఆ రోజు ఏం జరిగింది,ప్రజలు ఎందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు,ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు అనే విషయాలను నేటి పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.పాత ఫొటోలు,పత్రాలు,ఉద్యమకారుల కుటుంబాల వద్ద ఉన్న జ్ఞాపకాలను సేకరించి భద్రపరిస్తే భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుంది.చరిత్రను గుర్తుంచుకోవడం అంటే గతాన్ని తలచుకోవడం మాత్రమే కాదు.మన స్వేచ్ఛకు ఉన్న విలువను అర్థం చేసుకోవడం.

# మిర్యాలగూడ రైతు ర్యాలీకి నో పర్మిషన్!



నల్లగొండ, నేటిధాత్రి:
మిర్యాలగూడలో బీఆరెస్ ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించ తలపెట్టిన రైతు ర్యాలీ, బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ, అనంతరం రాజీవ్ చౌక్‌లో సభ నిర్వహించేందుకు బీఆరెస్ నేతలు అనుమతి కోరారు. కేటీఆర్ ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది.
రాజీవ్ చౌక్ ప్రధాన కూడలి కావడం, రహదారులు ఇరుకుగా ఉండటం, వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం లేకపోవడంతో భారీగా జనసమీకరణ జరిగితే ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. కోదాడ--జడ్చర్ల జాతీయ రహదారి కూడా ఈ మార్గంలోనే ఉండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశముందని పేర్కొన్నారు.
ప్రభుత్వ, ఇతర ముఖ్య కార్యాలయాలు సమీపంలో ఉండటంతో సభ నిర్వహిస్తే సాధారణ కార్యకలాపాలకు ఇబ్బందులు ఏర్పడతాయని పోలీసులు తెలిపారు. అందువల్ల ర్యాలీ, సభకు అనుమతి నిరాకరించారు. అయితే ప్రజలకు అసౌకర్యం కలగని విధంగా గ్రౌండ్ లేదా ఫంక్షన్ హాల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించుకోవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.

# కేసీఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

సూర్యాపేట, నేటిధాత్రి:
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేసీఆర్ అంటేనే రేవంత్‌రెడ్డి అనుక్షణం భయపడుతున్నారని, అందుకే ఆయనపై పదేపదే విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.
'కేసీఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ము నీకుందా?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్రంలో నీటి సమస్యలు తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.



వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రా ప్రాంతానికి నీరు తరలిస్తున్నా అడ్డుకోలేని పరిస్థితి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు.
రాష్ట్రంలో తాగునీరు, విద్యుత్, రైతు భరోసా, యూరియా తదితర సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆరెస్ ఆధ్వర్యంలో పోరుబాట ప్రారంభిస్తామని ప్రకటించారు.


### మిర్యాలగూడలో రైతు సభ నిర్వహించి తీరుతాం

కేటీఆర్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ రైతు సభ నిర్వహించనున్నట్లు జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా సభ నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆరెస్ పోరాటం కొనసాగుతుందని అన్నారు.

# భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలు

## రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్–400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలను భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలను పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్–400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీ చేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన'గా పిలుస్తున్న ఎస్–400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను సమర్థవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్–400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్–400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్–400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు,



వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం భారత్ మొత్తం 5 ఎస్–400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. మరో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999